ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 01.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 340 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



ప్రపంచకప్ నుంచి పాకిస్థాన్ ఔట్.. 10





విరుచుకుపడుతున్న ఇరాన్

యూఏఈ, ఖతార్, సౌదీలపై దాడులు

- అమెరికా సైనిక స్థావరాలున్న అబుదాబి, దోహా, రియాద్‌పై మిస్సైల్స్
- ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ రక్షణ మంత్రి మృతి
- ఇరాన్ దాడితో బుర్జ్ ఖలీఫా ఖాళీ..
- ఇరాన్, అమెరికా మధ్య శాంతి చర్చలు అవసరం
- బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల ప్రకటన

...:: 2లో

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్

బాంబుల వర్షం

క్షిపణి దాడులు చేసినట్లు ప్రకటించిన ఇజ్రాయెల్ రక్షణమంత్రి

- ఇజ్రాయెల్‌కు పొంచి ఉన్న ముప్పులను తొలగించేందుకేనని వెల్లడి
- దేశంలోని పౌరులను అప్రమత్తం చేసిన ఇజ్రాయెల్ సైన్యం
- యుద్ధ సైరన్ మోగించి ప్రజలను అప్రమత్తం చేసిన ఇజ్రాయెల్ ప్రభుత్వం
- ఇజ్రాయెల్‌లోని భారతీయులంతా సురక్షిత ప్రదేశాల్లో ఉండాలి
- ఇజ్రాయెల్‌లోని భారత ఎంబసీ కీలక ప్రకటన

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య యుద్ధం మొదలైంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సైనిక దళాలు ఆకస్మిక దాడి చేశాయి. టెహ్రాన్‌పై క్షిపణుల వర్షం కురిపించాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని సుప్రీం లీడర్ 86 ఏళ్ల ఆయతుల్లా అలీ ఖమేనీ కార్యాలయాలు లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికా సైన్యాలు కలిసి ఈ దాడులు

...:: మిగతా 2లో

కాకినాడ జిల్లాలో భారీ పేలుడు

బాణాసంచా తయారీ కేంద్రంలో ఘటన



- 23 మంది కార్మికులు మృతి
- పరిమితికి మించి బాణాసంచా తయారు చేయడం వల్లే
- మృతుల కుటుంబాలకు 20 లక్షల ఆర్థిక సాయం
- ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- ఈ ఘటన చాలా బాధాకరం: ప్రధాని మోడీ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

అమరావతి, ఫిబ్రవరి 28: ఏపీలోని కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంజి.మేడుపాడు మధ్య భారీ పేలుడు సంభవించింది. ఒక బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో 23 మందికిపైగా మరణించినట్లు సమాచారం. మరో ఐదుగురు గాయపడ్డారు. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. ఘటనా స్థలంలో ఇంకా భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. ప్రమాద స్థలంలో ఇంకొందరు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఇది స్థానికుల నుంచి అందిన ప్రాథమిక సమాచారం. అయితే, మృతులు, క్షతగాత్రుల

...:: మిగతా 2లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్- 6.28 (ఆదివారం సాయంత్రం)

సహర్- 5.11 (సోమవారం ఉదయం)



హార్డ్ వేర్ రంగం లోనూ భారత్ సత్తా

గ్లోబల్ టెక్నాలజీ వాల్యూ చైన్‌లో భారత్ వేగంగా భాగం అవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ల వాణిజ్యంలో భారత్ కీలక పాత్ర పోషించబోతుందని మోదీ తెలిపారు.

9

శారదా పీఠానికే ఆ భూమిని కొనసాగించాలి



- పీఠం భూములు జల మండలికి కేటాయింపు
- ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చిన పీఠం ప్రతినిధులు
- జల మండలికి భూ కేటాయింపులు రద్దు చేయండి
- అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదారాబాద్, ఫిబ్రవరి 28: హైదరాబాద్ కోకాపేటలో శారదా పీఠానికి కేటాయించిన భూమిని పీఠానికే కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీఠం భూములు జల మండలికి కేటాయించిన నేపథ్యంలో అక్కడ సాగుతున్న నిర్మాణ పనుల విషయాలను పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. కోకాపేట భూముల్లో పీఠం ఆధ్వర్యంలో వివిధ నిర్మాణాల తాజా స్థితిని తెలుసుకున్నారు. పీఠం భూములను జలమండలికి కేటాయించే సమయంలో నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. జల మండలికి కేటాయింపులు రద్దు చేసి శారదా పీఠానికే ఆ భూములు కొనసాగించాలని ఆదేశించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి నిర్మాణాలు, ఇతర పరిస్థితులను వివరించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శారదా పీఠం ప్రతినిధులకు సూచించారు.



తిరుగులేని రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టాలి

- ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పం
- రాష్ట్రంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం
- జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం
- 4 కోట్ల ప్రజల పండుగ సంబురంగా జరుపుకోవాలి
- పౌర సేవలన్నింటినీ మరింత సులభతరం చేయాలి
- ఇంటి నుంచే అన్ని సేవలు పొందేలా సంస్కరణలు తేవాలి
- ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ విద్య ప్రక్షాళన
- దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం
- ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 28: దేశ అభివృద్ధి పథంలోనూ, పరిపాలనలోనూ తెలంగాణను తిరుగులేని ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో రాష్ట్రంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు రాష్ట్రంలో ఈ ప్రణాళికను అమలు చేయాలని అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ 4 కోట్ల ప్రజల పండుగ సంబురంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకను పురస్కరించుకొని 99 రోజుల

...:: మిగతా 2లో



ఖమేని బతికే ఉన్నారు

ఖమేనీని అంతం చేయడమే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ టెహ్రాన్‌పై సైనిక దాడులకు తెగబడ్డాయి. ఖమేనీ హతమయ్యారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే.. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్‌చీ మాత్రం ఖమేనీ, అధ్యక్షుడు మృతి చెందారనే వార్తల్ని ఖండించారు.

9

దేవాలయాలు, మఠాలను

కూల్చేందుకు కాంగ్రెస్ కుట్రలు



- కేసీఆర్ ప్రభుత్వంలో శారద పీఠానికి చట్టబద్ధంగా భూ కేటాయించాం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లతో పాటు ఇప్పుడు దేవాలయాలు, మఠాలను సైతం కూల్చేందుకు కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ల హరీశ్ రావు మండిపడ్డారు. కోకాపేట్ నియోపోలిస్‌లోని విశాఖ శారద పీఠం, రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు అకస్మాత్తుగా చుట్టుముట్టి ఖాళీ చేయాలంటూ భయాందోళనలకు గురిచేస్తున్న నేపథ్యంలో హరీశ్‌రావు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నట్లు రేవంత్ రెడ్డి పాలన

...:: మిగతా 2లో



మదీనా ప్రమాద బాధితులకు పరిహారం

- చెక్కులు అందించిన సీఎం రేవంత్ రెడ్డి
- 5 లక్షల చొప్పున 44 మంది కుటుంబాలకు పరిహారం
- బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది :సీఎం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 28: గతేడాది నవంబర్ నెలలో సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబసభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిహారం అందించారు. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన 44 మంది

...:: మిగతా 2లో



విమాన సర్వీసులపై కేంద్రం అలర్ట్

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకున్న వేళ, అంతర్జాతీయ విమాన సర్వీసులపై పడే ప్రభావంపై కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

9

రాష్ట్రీయం

తిరుగులేని రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టాలి

మొదటిపేజీ తరువాయి

పాటు జరిగే 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ బి. శివధర్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దేశ అభివృద్ధి పథంలోనూ, పరిపాలనలోనూ తెలంగాణను తిరుగులేని ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి వరకు షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలను విజయవంతం చేయాలి. అందుకు అవసరమైన ప్రణాళికను వెంటనే సిద్ధం చేసి ఆచరణలో చూపెట్టాలని, ఈ కార్యక్రమానికి ప్రత్యేక లోగో తయారు చేయడమే కాకుండా రాష్ట్రమంతా 99 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల షెడ్యూలును సీఎస్ రూపొందించాలన్నారు..

పరిపాలనలో సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించాలి

పరిపాలనలో అధునాతన సాంకేతిక నైపుణ్యాన్ని సమర్థంగా వినియోగించాలని, రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పౌరులకు అవసరమైన సేవలన్నింటినీ మరింత సులభతరం చేయాలని, ఇంటి నుంచే ఆన్‌లైన్‌ద్వారా అన్ని సేవలు పొందేలా సాంకేతిక సంస్కరణలు తీసుకురావాలని సీఎం అన్నారు. కరెంట్ మీటర్, తమ ఇంటి అనుమతి, నల్లా కనెక్షన్ మొదలు ప్రభుత్వం నుంచి పొందాల్సిన అనుమతులకు, సేవలకు ప్రజలు ఆఫీసులకు రావాల్సిన అవసరం లేకుండా పనులు జరగాలని, వాహనం కొనుగోలు చేసిన షోరూమ్‌లోనే రిజిస్ట్రేషన్ జరిగే విధానం అమల్లోకి వచ్చినట్టుగా, ప్రతి విభాగంలోనూ సంస్కరణలు తీసుకురావాలన్నారు. ఏ ఫైలు, ఏ అర్జీ ఎక్కడ ఉందో దరఖాస్తుదారు తెలుసుకునే సునాయస విధానం అమలులోకి రావాలని అన్నారు. మహాలక్ష్మి, రేషన్ కార్డులు, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు, ఆరోగ్య శ్రీ అర్హులైన వారందరికీ చేరాలని, సొంత స్థలముండి ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి అందాలని, రేషన్ కార్డులు అప్లై చేసుకునే ప్రక్రియ నిరంతరం కొనసాగాలని సీఎం అన్నారు.

ప్రభుత్వ విద్య ప్రక్షాళన

'ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించేలా రాష్ట్రంలో వంద మండలాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ప్రారంభిస్తున్నాం. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేయటంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సేవలను మెరుగుపరిచే విధానాలు అమలు చేయాలి. తెలంగాణ రైజింగ్ విజన్ లో భాగంగా ప్రభుత్వం రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ మూడు జోన్లుగా విభజించి దేశంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాం. కోర్ అర్బన్ రీజియన్ లో చేపట్టాల్సిన సర్వీస్ సెక్టార్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకోవాలి. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీకి దాదాపు 10 వేల చ.కి.మీ. మ్యానుఫాక్చరింగ్ జోన్ భవిష్యత్తులోనూ కీలకంగా మారుతుంది. అన్ని విభాగాల్లో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులతో పాటు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల డేటా కార్యదర్శుల వద్ద సిద్ధంగా ఉండాలి. రాష్ట్రంలో మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండడానికి వీలు లేదు. ప్రతి శాఖకు సొంత భవనం ఉండాలి. బడ్జెట్ ప్రతిపాదనల్లో వీటిని చేర్చాలి.' అని సీఎం అన్నారు.

దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఫ్యూచర్ సిటీ

హైదరాబాద్లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ తో పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరం, విదేశీ పర్యటనలతో రాష్ట్రానికి దాదాపు రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని సీఎం అన్నారు. ఈ ఎంఓయూలన్నీ ఫలవంతమయ్యేలా కార్యదర్శులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి అవి గ్రౌండయ్యేంత వరకు సంప్రదింపులు జరపాలని, దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం, అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ఇప్పటివరకు సాధించిన విజయాలను నిజాయితీగా అంచనా వేసుకుని, ఎక్కడ లోటుపాట్లు ఉన్నాయో అధికారులు గుర్తించాలని సీఎం రేవంత్ అన్నారు. వచ్చే ఎన్నికల నాటికి మిగిలిన రెండేళ్లు తొమ్మిది నెలలకు సరైన దిశా నిర్దేశంతో కార్యాచరణ రూపొందించుకోవాలి. ప్రజలు చూపిన విశ్వాసాన్ని మాటలతో కాకుండా సుపరిపాలనతో గౌరవించాల్సిన బాధ్యత తనతో పాటు అధికారులు అందరిపైనా ఉంది అని ముఖ్యమంత్రి నిర్దేశం చేశారు.

మదీనా ప్రమాద బాధితులకు పరిహారం

మొదటిపేజీ తరువాయి

ప్రాణాలు కోల్పోగా, మృతుల కుటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి పరిహారం చెక్కులు అందించారు. ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున 44 మంది కుటుంబాలకు పరిహారం అందించారు. నాటి ఘటనలో గాయపడిన వారికి రూ.3 లక్షల చొప్పున తెలంగాణ ప్రభుత్వం పరిహారం అందించింది. నాటి దుర్ఘటన సమయంలో ప్రమాదం గురించి తనకు తెలిసిన వెంటనే సహాయ చర్యలపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. సహాయక చర్యల పర్యవేక్షణకోసం మంత్రి అజారుద్దీన్‌ను మదీనాకు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. బాధిత కుటుంబాలకు 5 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. నాంపల్లి అగ్ని ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు కూడా తెలంగాణ ప్రభుత్వం అండగా నిలబడిన విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకం కల్గించడం ముఖ్యమన్న రేవంత్ రెడ్డి.. అందుకోసమే బాధిత కుటుంబాలను సెక్రటేరియట్‌కు పిలిపించి పరిహారం అందించామన్నారు. తెలంగాణ ప్రభుత్వం మీ ఆనందంతో పాటుగా కష్టంలోనూ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. 2025, నవంబర్ 17వ తేదీన సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. యాత్రికులతో వెళ్తోన్న బస్సు ఓ డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. మక్కా యాత్ర పూర్తిచేసుకుని మదీనా వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. బలంగా ఢీకొట్టడంతో బస్సులో మంటలు ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదంలో 45 మంది చనిపోయారు. ప్రమాద సమయంలో అందరూ నిద్రలో ఉండటంతో ఎక్కువ ప్రాణనష్టం సంభవించింది. ఈ ప్రమాదంలో చనిపోయిన వారంతా హైదరాబాద్‌కు చెందిన వారేనని హజ్ కమిటీ పేర్కొంది. 18 మంది మహిళలు, 17 మంది మగవారితో పాటుగా, 10 మంది చిన్నారులు మృతి చెందినట్లు వెల్లడించింది. ప్రమాదం తెలిసిన వెంటనే స్పందించిన తెలంగాణ ప్రభుత్వం కేంద్రంతో కలిసి సహాయకచర్యలు చేపట్టింది. బాధితులకు అండగా ఉంటామని ప్రకటించిన ప్రభుత్వం.. పరిహారం అందించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం మేరకు సీఎం రేవంత్ రెడ్డి.. శనివారం రోజున పరిహారానికి సంబంధించిన చెక్కులు బాధితులకు అందజేశారు.

దేవాలయాలు, మఠాలను
కూల్చేందుకు కాంగ్రెస్ కుట్రలు

మొదటిపేజీ తరువాయి

తయారైందని హరీశ్‌రావు అన్నారు. అడ్డగోలు వ్యవహారాలకు, అక్రమాలకు పాల్పడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా దేవాలయాలు, మఠాలను కూడా కూల్చే స్థాయికి దిగజారిందని విమర్శించారు. 2019లో కేసీఆర్ ప్రభుత్వంలో కోకాపేట సర్వే నెంబర్ 240లో విశాఖ శారద పీఠానికి చట్టబద్ధంగా కేబినెట్ ఆమోదంతో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు. పీఠం నిర్వాహకులు ప్రభుత్వానికి 1.05 కోట్లు చెల్లించి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారని పేర్కొన్నారు. అలాగే హెచ్ఎండీఏకు రూ. 23 లక్షలు చెల్లించి అనుమతులు, విద్యుత్ కనెక్షన్ అన్నీ తీసుకున్నారని చెప్పారు. ఇక్కడ అద్భుతమైన శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి దేవాలయం, గోశాల, నిత్య అన్నదాన సత్రం, వేద పాఠశాల నిర్మించారని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు, అధికారుల సమక్షంలో పెద్ద స్వామీజీ చేతుల మీదుగా ప్రతిష్ఠా కార్యక్రమం జరిగిందని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇక్కడ నిత్య పూజలు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో శారద పీఠం కింద 16 దేవాలయాలు, లక్షలాది మంది భక్తులు ఉన్నారని తెలిపారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తా అంటూ.. కేసీఆర్ కట్టిన గుళ్లు, గోపురాలు, మఠాలను కూల్చడమేనా రేవంత్ రెడ్డి ఉద్దేశమని మండిపడ్డారు.

అంతా కూల్చడమే తప్ప, నిర్మాణం లేదా?

'హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చావు, ఖమ్మంలో ఇళ్లు కూల్చి 800 మందిని రోడ్డున పడేశావు. నీ పాలనలో అంతా కూల్చడమే తప్ప, నిర్మాణం లేదా' అని సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ వర్క్స్ జలమండలి కోసం ఈ స్థలం తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతోందని తెలిపారు. వాటర్ వర్క్స్ కట్టాలంటే ఈ దేవాలయం స్థలమే దొరికిందా.. సరిగ్గా ఈ ఆలయానికి రోడ్డు అవతలే సర్వే నెంబర్ 239, 240లలో 17 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది కదా, వాటర్ వర్క్స్ అక్కడ కట్టుకోవచ్చు కదా అని ప్రశ్నించారు. ఆ 17 ఎకరాల భూమిని రేవంత్ రెడ్డి తన అల్లుడికి, మేనల్లుళ్లకు, వాళ్ల అనుచరులకు భాగ్యలక్ష్మి మైన్స్ అండ్ మినరల్స్ అక్రమంగా కట్టబెట్టారని తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద నేనే స్వయంగా అడిగితే ప్రభుత్వం ఇచ్చిన జవాబు ఇది అని తెలిపారు.. 10 ఎకరాలు ఇస్తే వాళ్లు 17 ఎకరాలు కబ్జా పెట్టారని పేర్కొన్నారు. ఓపెన్ ఆక్షన్ వేస్తే ప్రభుత్వానికి వందల కోట్లు వచ్చేవి. కానీ లోపల లోపల నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం ఓఆర్ఆర్‌కు కిలోమీటర్ లోపల ఎలాంటి క్రషర్లు ఉండకూడదు.. కానీ రేవంత్ రెడ్డి తన అల్లుడి కోసం ఇక్కడ ఏకంగా 5 రెడీమిక్స్ ప్లాంట్లు, క్రషర్లు పెట్టించారని హరీశ్‌రావు తెలిపారు. పక్కన ఉన్న బిల్డర్లంతా తన అల్లుడి దగ్గరే కంకర కొనాలని, లేకపోతే అనుమతులు ఇవ్వమని బెదిరిస్తూ దందా చేస్తున్నారని పేర్కొన్నారు. 'అల్లుడికి వ్యాపారం చేసుకోవడానికి 17 ఎకరాలు ఇస్తావు కానీ.. హిందూ ధర్మాన్ని ప్రచారం చేసే శారద పీఠానికి ఉన్న రెండు ఎకరాలను మాత్రం లాక్కుని కూలుస్తావా' అని మండిపడ్డారు. భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే నీ ధర్మమా.. తక్షణమే ఆ అక్రమ క్రషర్లను క్యాన్సిల్ చేయాలని డిమాండ్ చేశారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా నిన్న రాత్రి 11:30 గంటలకు వందలాది మంది పోలీసులు, ఎంఆర్వోలు వచ్చి ఆలయం వద్ద పీఠాధిపతిని, నిర్వాహకులను భయభ్రాంతులకు గురిచేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ లో నిర్ణయం తీసుకునే ముందు పీఠాధిపతులతో మాట్లాడే కనీస సంస్కారం ఈ ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు.

“



రణ్‌వీర్ సింగ్ నటించిన ధురంధర్-2 సినిమాను చూశా. ఈ మూవీ కోసం నా భర్త, డైరెక్టర్ ఆదిత్య ధర్ చేసిన వర్క్‌ను చూసి చాలా గర్వపడుతున్నా. ధురంధర్-2 చిత్రం అంచనాలకు మించి ఉంటుంది. సినిమా చూసి ఎమోషనల్ అయ్యాను. ఆదిత్య దేశాన్ని, ప్రేక్షకులను ఎంతో ప్రేమిస్తారు. సినిమాను చూసిన ఆడియన్స్ ఎప్పటికీ మర్చిపోలేరు. ఇదొక ఇండియన్ మూవీ అని గర్వంగా చెప్పుకుంటారు.

- నటి యామీ గౌతమ్

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ బాంబుల వర్షం

మొదటిపేజీ తరువాయి



చేశాయి. ఆయా కార్యాలయాల సమీపంలోనే పేలుళ్లు జరిగాయి. ఈ దాడులు జరిగిన టైంలో కార్యాలయంలో ఖమేనీ ఉన్నారా లేదా అనేది తెలియరాలేదు. అమెరికాతో సైనిక ఉద్రిక్తతల నేపథ్యంలో గత కొన్ని వారాలుగా ఆయన బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనడం మానేశారు. మరోవైపు టెహ్రాన్‌పై ఎటాక్ జరిగిన విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ మీడియా సైతం ధ్రువీకరించింది. ప్రస్తుతం టెహ్రాన్ నగరమంతటా సైరన్లు మోగుతున్నాయని, బాంబు పేలుడు శబ్దాలను విన్నామని తమ కథనాల్లో పేర్కొంది. ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఇరాన్ వెంటనే గగనతలాన్ని మూసివేసింది. దీంతోపాటు తమ దేశంలో మొబైల్ ఫోన్ సేవలను నిలిపివేసింది. అలాగే ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ సురక్షిత ప్రాంతానికి తరలించింది.

ఇరాన్‌పై దాడులు చేశాం : ఇజ్రాయెల్

తాము ఇరాన్‌పై దాడులు చేశామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ వెల్లడించారు. ఇజ్రాయెల్‌కు పొంచి ఉన్న ముప్పులను తొలగించేందుకే ఈ ఎటాక్స్ చేశామని స్పష్టం చేశారు. టెహ్రాన్‌పై తాము చేసిన దాడిలో ఎంతమంది చనిపోయారు, ఎవరు చనిపోయారు అనేది ఇంకా స్పష్టంగా తెలియదని ఇజ్రాయెల్ అధికార వర్గాలు తెలిపాయి. ఇక ఈ దాడిపై అమెరికా ఇప్పటివరకు స్పందించలేదు. ఈనేపథ్యంలో యావత్ ఇజ్రాయెల్‌లో ఆయన అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఇజ్రాయెల్ దాడికి ప్రతిగా ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులు చేస్తుందనే ఆందోళనలతో ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో అత్యవసర పరిస్థితిని అమలు చేస్తున్నారు. అంతటా ఎయిర్ రైడ్ సైరన్లు మోగుతున్నాయి. బంకర్లలో దాక్కోవాలి అంటూ ప్రజలకు ఇజ్రాయెల్ ప్రభుత్వం ఎమర్జెన్సీ మెసేజ్‌లను పంపుతోంది. తమ దేశంపై దాడి జరిగితే, ఊరుకునేది లేదని బలంగా ప్రతిఘటిస్తామని గతంలో ఇరాన్ హెచ్చరించింది.

ఇజ్రాయెల్‌లోని భారత ఎంబసీ కీలక ప్రకటన

ఇరాన్ ఇజ్రాయెల్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లోని భారత ఎంబసీ కీలక ప్రకటన విడుదల చేసింది. ఇజ్రాయెల్‌లోని భారతీయులంతా సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని పిలుపునిచ్చింది. అత్యంత అప్రమత్తంగా, ముందుజాగ్రత్త చర్యలతో వ్యవహరించాలని వారికి సూచించింది. ఇజ్రాయెల్ అధికార వర్గాలు, హోం ఫ్రంట్ కమాండ్ ఎప్పటికప్పుడు జారీచేసే భద్రతా మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కోరింది.

మిస్సైళ్లతో విరుచుకుపడుతున్న ఇరాన్

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా కలిసి శనివారం ఉదయం దాడులు చేయగా.. మధ్యాహ్నం నుంచి ఇరాన్ కూడా ప్రతిదాడులు ప్రారంభించింది. వరుస మిస్సైళ్లతో విరుచుకుపడుతోంది. అమెరికా సైనిక స్థావరాలున్న యూఏఈలోని అబుదాబి, ఖతార్‌లోని దోహా, సౌదీ అరేబియాలోని రియాద్‌పై మిస్సైల్స్ ప్రయోగించింది.

దీంతో మధ్యప్రాచ్య దేశాలు కూడా యుద్ధ వాతావరణంలోకి వచ్చేశాయి. తాము పేలుళ్ల శబ్దాలు విన్నామని అబుదాబి ప్రజలు చెప్పారు. ఈ ప్రాంతాలన్నీ అమెరికా సైన్యానికి, నౌకాదళానికి ఆశ్రయమిచ్చినవే. గల్ఫ్ కంట్రీస్‌లోని అమెరికా స్థావరాల్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులకు దిగింది. అబుదాబిలో యూఏఈ ఎయిర్‌ఫోర్స్, యూఎస్ ఎయిర్‌ఫోర్స్ కలిసి అల్ ధఫ్రా ఎయిర్ బేస్‌ను పంచుకుంటాయి. దుబాయిలోని జబేల్ అలీ పోర్ట్‌ను యూఎస్ నేవీ వాడుకుంటుంది. ఇక్కడ అమెరికా యుద్ధ నౌకలు, విమానాలు దిగుతుంటాయి. దోహాలో అల్ ఉదెయిద్ ఎయిర్ బేస్‌ను యూఎస్ సెంట్రల్ కమాండ్ వాడుకుంటుంది. సౌదీ అరేబియాలో 2,000 మందికిపైగా అమెరికన్ సైనికులున్నారు. ఇక్కడి బేస్ అమెరికా సైన్యానికి కీలక స్థావరంగా ఉంది. మిస్సైల్స్, ఇతర ఆర్మీ స్థావరాలు వంటివి ఇక్కడున్నాయి. బహ్రెయిన్‌లోని మనామా హెడ్ క్వార్టర్స్‌లోని అమెరికాకు చెందిన ఐదో నావికా స్థావరంపై ఇరాన్ మిస్సైల్ దాడి చేసింది. ఈ మిస్సైల్స్‌ను అడ్డుకున్నట్లు బహ్రెయిన్ ప్రకటించింది. మిగతా వివరాలు తర్వాత వెల్లడిస్తామని తెలిపింది. అయితే, ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం లేదని ఖతార్, సౌదీ ప్రకటించాయి. యుద్ధం నేపథ్యంలో ఇరాన్, ఇరాక్, కువైట్, బహ్రెయిన్, ఖతార్‌లలో ఎయిర్ స్పేస్‌ను ప్రస్తుతానికి మూసివేశారు.

ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ రక్షణ మంత్రి మృతి

ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ రక్షణ మంత్రి అమీర్ నసిర్జాదే మరణించారు. మరోవైపు అమెరికా సైన్యానికి ఆశ్రయమిస్తున్న గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేస్తోంది. క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన బిల్డింగ్ అయిన దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫాను అక్కడి ప్రభుత్వం ఖాళీ చేయించింది. అందులో నివాసం ఉంటున్నవారిని సురక్షిత ప్రాంతానికి తరలించింది. దుబాయ్‌పై ఇరాన్ మిస్సైల్ దాడి చేసిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా బుర్జ్ ఖలీఫాను ఖాళీ చేయించారు. ఇరాన్.. దుబాయ్, అబుదాబి, ఖతార్, రియాద్‌లపై దాడులకు దిగింది. అక్కడి అమెరికా సైనిక స్థావరాలపై మిస్సైల్స్‌తో దాడి చేసింది. దుబాయ్‌లోని రెసిడెన్షియల్ స్థావరాలపై ఇరాన్ జరిపిన దాడుల్లో ఒకరు మరణించినట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. దుబాయ్ ఎయిర్‌పోర్టును ప్రభుత్వం మూసివేసింది. ఇరాన్, అమెరికా మధ్య శాంతి చర్చలు అవసరమని బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ ప్రకటించాయి. దాడులు ఆపాలని, చర్చలు జరపాలని ఇరు దేశాలకు విజ్ఞప్తి చేశాయి. అమెరికన్ బేస్ క్యాంప్‌పై ఇరాన్ ప్రయోగించిన ఒక క్షిపణిని నేలకూల్చినట్లు అమెరికా రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. సిరియాపై కూడా ఇరాన్ దాడి చేసినట్లు తెలుస్తోంది.

ఇజ్రాయెల్ గగనతలం మూసివేత..

ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్‌తోపాటు వాటి పరిసర దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి. దాంతో ఇవాళ ఉదయం దేశ రాజధాని ఢిల్లీ నుంచి ఇజ్రాయెల్ నగరం టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం మార్గం మధ్యంలోనే వెనక్కి తిరిగి వచ్చేసింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా విమానాన్ని తిరిగి ఢిల్లీకే రప్పించినట్లు అధికారులు తెలిపారు. ఇరాన్‌పై దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి అధికారికంగా ధృవీకరించారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని యూనివర్సిటీ స్ట్రీట్, జోమ్హౌరీ జిల్లాల్లో క్షిపణి దాడులు జరిగినట్లు, అక్కడ భారీ పేలుళ్లు వినిపించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. కీలక ప్రభుత్వ భవనాలు ఉన్న పాశ్చర్ స్ట్రీట్ సమీపంలో దట్టమైన పొగలు అలుముకున్న దృశ్యాలు కనిపించాయి. అయితే ఆస్తి, ప్రాణనష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు. మరోవైపు తాము పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, ప్రయాణికుల భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. యుద్ధ వాతావరణం కారణంగా ఆ ప్రాంతంలో గగనతలాన్ని పాక్షికంగా మూసివేయడంతో పలు అంతర్జాతీయ విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. కజకిస్థాన్ నుంచి దుబాయ్ వెళ్లాల్సిన విమానాన్ని బాకుకు మళ్లించారు. షార్జామాస్కో విమానాన్ని పాకిస్థాన్ గగనతలం మీదుగా దారి మళ్లించారు. చికాగో నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిర్ ఇండియా విమానం సిరియా మీదుగా ప్రయాణించింది. దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ వ్యాప్తంగా ఎయిర్ రైడ్ సైరన్లు మోగించారు. ముందు జాగ్రత్త చర్యగా దేశవ్యాప్తంగా పాఠశాలలను మూసివేశారు. ప్రజలను ఇళ్ల నుంచే పని చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో గుమికూడవద్దని ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆదేశించింది. జెనీవాలో అమెరికా, ఇరాన్ అధికారుల మధ్య చర్చలు జరుగుతున్న కీలక సమయంలో ఈ దాడులు జరగడం గమనార్హం.

సైనిక ఆపరేషన్‌పై ట్రంప్ వీడియో సందేశం

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఉన్న ఆ దేశ సుప్రీంనేత అయతుల్లా అలీ ఖమేనీ నివాసంపై అటాక్ చేసినట్లు తెలుస్తోంది. టెహ్రాన్‌లోని పాస్చేర్ జిల్లాలో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. చాలా కట్టుదిట్టమైన కాంపౌండ్ ఉన్న నివాసం, ఆఫీసుపై అటాక్ జరిగింది. ఆ ప్రాంతంలోనే ఖమేనీ నివాసం ఉన్నది. ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ప్రకారం సుమారు ఆ ప్రాంతంపై ఏడు మిస్సైళ్లతో దాడి చేసినట్లు తెలుస్తోంది. మరో వైపు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వీడియో సందేశాన్ని రిలీజ్ చేశారు. ట్రూత్ సోషల్‌లో ఆయన దాన్ని పోస్టు చేశారు. ఇరాన్‌పై సైనిక ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించారు. విషపూరిత ఇరానీ పాలకుల నుంచి అమెరికా ప్రజలను రక్షించాలన్నదే తమ ముఖ్య ఉద్దేశం అన్నారు. అయితే ఇరాన్‌పై జరిపిన దాడులను ఇజ్రాయెల్ సహాయంతో చేపట్టినట్లు ఆయన ప్రత్యక్షంగా తన సందేశంలో వెల్లడించలేదు. ఇరాన్‌లో చేపట్టిన మిలిటరీ ఆపరేషన్ వల్ల అమెరికా ప్రజలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తన వీడియో సందేశంలో ట్రంప్ పేర్కొన్నారు. ఇరానీ పాలకులు చంపాలనుకుంటున్నారని, అయితే అమెరికా సాహసోపేత సైనికులు ఆ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉన్నదని, యుద్ధంలో ఇది సహజమే అని అన్నారు.

మినాబ్‌లో దాడి 40 మంది బాలికలు మృతి

ఇరాన్‌పై ఇజ్రాయెల్‌అమెరికా దాడితో పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. శనివారం ఉదయం ఇజ్రాయెల్ భూ భాగం నుంచి అమెరికా దాడులు ప్రారంభించింది. మినాబ్‌లో ఇరాన్ పారా మిలటరీ రివల్యూషనరీ గార్డ్ స్థావరం ఉండటంతో దానిపై దాడులు జరిగాయి. అయితే ఆ ప్రాంతానికి సమీపంలో ఓ బాలికల పాఠశాల కూడా ఉంది. ఇజ్రాయెల్ వైమానిక దాడులకు ఈ పాఠశాల తీవ్రంగా ధ్వంసమైంది. కనీసం 40 మంది బాలికలు చనిపోయినట్టు సమాచారం. పదుల సంఖ్యలో పిల్లలు తీవ్ర గాయాల పాలైనట్టు సమాచారం. ఈ దాడుల అనంతరం అమెరికా అధ్యక్షుడు మాట్లాడుతూ.. మీ విధిని మీరే లిఖించుకోవాలని, 1979 నుంచి దేశాన్ని పాలిస్తున్న ఇస్లామిక్ నాయకత్వానికి వ్యతిరేకంగా గళమెత్తాలని ఇరాన్ పౌరులకు పిలుపునిచ్చారు.

కాకినాడ జిల్లాలో భారీ పేలుడు


మొదటిపేజీ తరువాయి



విషయంలో అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. పేలుడు ధాటికి మృతదేహాలు పొలాల్లోకి ఎగిసిపడ్డాయి. అక్కడ పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఇంకా మంటలు అదుపులోకి రాలేదు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నట్లు తెలుస్తోంది. పేలుడు సమయంలో అక్కడ 20 మందికిపైగా కార్మికులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు ప్రభావంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో దట్టమైన పొగ అలుముకుంది. పరిమితికి మించి బాణాసంచా తయారు చేయడం వల్లే ఈ ఘటన అని ప్రాథమిక అంచనా. స్థానిక పెదపూడి రోడ్డులోని పొలాల్లో అడపా నాని కుటుంబ సభ్యులు ఒక బాణాసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఈ తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. పేలుడు పదార్థాలు అక్కడే ఉండటంతో మంటలు ఎగసిపడుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. మంటలు అదుపులోకి తేవడం కష్టంగా మారింది. భారీ పేలుడు శబ్దాలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

మృతుల కుటుంబాలకు 20 లక్షల ఆర్థిక సాయం

కాకినాడ జిల్లా వేట్లపాలెంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధితులకు అవసరమైన అన్ని సహాయాలు అందిస్తామని మాటిచ్చారు. అలాగే మృతుల కుటుంబాల పిల్లల విద్య బాధ్యతను పూర్తిగా ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. వారి చదువు పూర్తయ్యే వరకు అవసరమైన అన్ని ఖర్చులనూ భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్స



పొందుతున్న క్షతగాత్రులకు ఎంత ఖర్చయినా మెరుగైన వైద్యం అందిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుందని, ఆర్డీవో, డీఎస్పీ, అగ్నిమాపక శాఖాధికారి, కార్మిక శాఖ అధికారులను సస్పెండ్ చేసినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ ప్రమాదానికి కారణమైన బాణసంచా వ్యాపారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. వారి ఆస్తులను జప్తు చేసి బాధితులకు అందజేస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు.

ఈ ఘటన చాలా బాధాకరం: ప్రధాని మోదీ

'కాకినాడ జిల్లాలోని కర్మాగారంలో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడులో ప్రాణనష్టం సంభవించడం చాలా బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో బాధితులు, వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 ఎక్స్‌గ్రేషియా పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి అందజేస్తున్నాం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి

కాకినాడ జిల్లాలోని వేట్లపాలంలో బాణసంచా పేలుళ్ల ఘటనపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'ఆంధ్రప్రదేశ్‌లోని బాణసంచా కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం సంభవించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసాయం అందుతోంది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని అమిత్ షా పేర్కొన్నారు.

డాక్టర్ పొన్నం రవిచంద్రకు అరుదైన గౌరవం



- 'లైఫ్ టైమ్ లిటరరీ & వాయిస్ ఆఫ్ సినిమా' అవార్డు ప్రదానం
- ఎంపీ విజయేంద్రప్రసాద్ చేతుల మీదుగా అందించిన 'ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్' ప్రతినిధులు

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 28: ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్, సినీ విమర్శకులు, రచయిత డాక్టర్ పొన్నం రవిచంద్ర అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. అక్షరాన్ని ఆయుధంగా మలచుకుని, సినిమాను విశ్లేషణాత్మక కోణంలో సమాజానికి పరిచయం చేస్తున్న ఆయన సేవలకు గుర్తింపుగా 'లైఫ్ టైమ్ లిటరరీ & వాయిస్ ఆఫ్ సినిమా' పురస్కారాన్ని ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రదానం చేసింది. హైదరాబాద్లో 27న సాయంత్రం హైదరాబాద్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ లో జరిగిన వేడుకలో రాజ్యసభ సభ్యులు, తెలుగు సినిమా రచయిత కేవీ విజయేంద్రప్రసాద్ చేతుల మీదుగా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు డా. హరి కుమార్, డా. భూపాల్ నానావత్, డా. పావని అందించారు. రవిచంద్ర కలం నుంచి జాలువారిన సరికొత్త అద్భుతం 'తెలంగాణ సినీ ప్రస్థానం' పుస్తక ఆవిష్కరణ సందర్భంగా ఈ గౌరవం లభించడం విశేషం. దశాబ్దాల సినీ చరిత్రను, ముఖ్యంగా తెలంగాణ ప్రాంత కళాకారుల శ్రమను ఈ పుస్తకం ద్వారా పొన్నం రవిచంద్ర భావితరాలకు అందించారు. ఈ గౌరవ పత్రాన్ని 27న శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ లో జరిగిన వేడుకలో అపోలో మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ హరి కుమార్, కిసాన్ పరివార్ ఛైర్మన్ డాక్టర్ భూపాల్ నానావత్, క్రాస్ కంట్రీ కన్సల్టెంట్ డాక్టర్ పావని వంటి ప్రముఖులు అవార్డును అందించారు. సినిమాను ఒక శాస్త్రంగా, ఒక కవితాత్మక సింఫనీగా మార్చిన మేధావి పొన్నం రవిచంద్ర అంటూ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ఆయనను కొనియాడారు.



రవిచంద్ర అవార్డుల ప్రస్థానం

- 2012లో తన అద్భుత రచన 'ప్రస్థానం' (80 ఏళ్ల సినీ ప్రయాణం) కు గాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ప్రతిష్టాత్మక నంది అవార్డు అందుకున్నారు.
- 2025లో 'తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు'ను కైవసం చేసుకున్నారు.
- యునైటెడ్ టెక్నాలజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ పొందారు.
- 8వ నేపాల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు జ్యూరీ మెంబర్‌గా వ్యవహరించారు.

బీఆర్ఎస్ గాయపడిన కాంగ్రెస్ కార్యకర్తను పరామర్శించిన మంత్రి వివేక్

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 28: క్యాతనపల్లి లో ఇటీవల బిఆర్ఎస్ నాయకులు జరిపిన దాడిలో గాయపడిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త జావిద్ ఖాన్‌ను రాష్ట్ర కార్మిక మరియు మైనింగ్ శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి గారు మందమర్రి లో మరి నివాసంలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, ధైర్యం చెప్పారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి గారు పలు ముఖ్యాంశాలను వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం ఏటీసీ సెంటర్లలో హార్టీకల్చరల్, అగ్రికల్చరల్ కోర్సులను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకు



మంజూరు చేశామని, రాబోయే ఏప్రిల్ నెలలో మరో 2,000 ఇండ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఇంటింటికి తాగునీరు అందించేందుకు అమృత్ పథకం కింద రూ.100 కోట్లతో పనులు జరుగుతున్నాయని, ఆరు నెలల్లో పూర్తిచేసి ప్రతి ఇంటికి తాగునీరు అందేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు నీరు అందించాలని సూచించినట్లు చెప్పారు. గత బిఆర్ఎస్ హయంలో డ్రైనేజీ కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఆరోపించిన మంత్రి గారు, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, మాజీ పీసీసీ మెంబర్ గుడ్ల రమేష్ జిల్లా నాయకులు, పైడిమల్ల నర్సింగ్ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఆకారం రమేష్ యువజన కాంగ్రెస్ నాయకులు సట్ల సంతోష్ , కనకం రాజు, ఎర్ర రాజు , ఎండి ఇసాక్, మాయ తిరుపతి, సోతుకు ఉదయ్ , రాకం సంతోష్, పాష ,వేముల శ్రీనివాస్, రాజేష్, అందుగుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల కోసం పనిచేసే నాయకురాలు కవిత

- ప్రజల కోసం పనిచేసే నాయకురాలు కవిత
- తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకురాలు మేక లలిత యాదవ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో,హైదారాబాద్, ఫిబ్రవరి 28: ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో జాగృతి అధినేత కల్వకుంట్ల కవితకు లభించిన ఊరటపై హర్షం వ్యక్తం చేస్తూ, ఆమె నివాసంలో తెలంగాణ జాగృతి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మేక లలిత యాదవ్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థపై మా నమ్మకాన్ని ఈ పరిణామం మరింత బలపరిచిందన్నారు. 'నిప్పుకి చెదలు పట్టదు' అని, కవిత ఎప్పుడూ ప్రజల కోసం పనిచేసే నాయకురాలని అన్నారు. ఆమెపై వచ్చిన ఆరోపణలు నిజం కాదని మేము మొదటి నుంచీ విశ్వసిస్తున్నామన్నారు. న్యాయం విజయం సాధించడం సంతోషకరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ కోఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, జాగృతి సీనియర్ నాయకురాలు విమలరెడ్డితో పాటు జాగృతి కుటుంబ సభ్యులు హాజరై తమ ఆనందాన్ని పంచుకున్నారు.



బిజెపి ఎమ్మెల్యేల అరెస్ట్

- బాన్స్‌వాడ వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 28: బాన్సువాడలో ఇటీవల జరిగిన సంఘటనల నేపథ్యంలో బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ మేరకు సదాశివనగర్ మండలం పద్మాజీవాడ ఎక్స్ రోడ్ వద్ద పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. కామారెడ్డిలో బీజేఎల్పీ సమావేశం అనంతరం బాన్సువాడకు బయలుదేరిన బీజేపీ ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కామారెడ్డి, ఆర్మూర్, నిర్మల్, నిజామాబాద్ ఎమ్మెల్యే లు వెళ్తున్న సందర్భంగా పోలీసులు అడ్డుకున్నారు.

భూభారతి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం భారీ స్కామ్

- నిషేధిత భూముల జాబితాను పెంచి వసూళ్లు
- 35 మండలాల్లో ఈ స్కామ్ జరిగింది
- భూభారతి పోర్టల్‌లో ఎడిట్ ఆప్షన్ ఆపరేటర్లకు ఎలా దొరికింది?
- ఈ స్కామ్‌పై సిట్, సిఐడీ విచారణ చేయాలి
- కాజీపేటలో నిర్మిస్తున్నది కోచ్ ఫ్యాక్టరీనా? లేక వ్యాగన్ ఫ్యాక్టరీనా?
- రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అయితే కేంద్రం వెంటనే గెజిట్ విడుదల చేయాలి
- లేకపోతే ఫ్యాక్టరీ ఓపెనింగ్‌కు వచ్చే బీజేపీ మంత్రులను అడ్డుకుంటాం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు



ప్రతిపక్షం, జనగామ, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ సర్కార్ భూభారతి పేరుతో భారీ స్కామ్ చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ భూభారతి పేరుతో భారీ స్కామ్ చేస్తోందన్నారు. నిషేధిత భూముల జాబితాను పెంచుకుంటూ వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. సెటిల్‌మెంట్ అయిన తర్వాత నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తున్నారని అన్నారు. విలువైన భూములను నిషేధిత జాబితాలో చేర్చి అక్రమ వసూళ్లు చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. భూభారతి స్కామ్‌లో అసలు నిజాలను బయటకు రానివ్వట్లేదని విమర్శించారు. 35 మండలాల్లో ఈ స్కామ్ జరిగిందని, భూభారతి పోర్టల్‌లో ఎడిట్ ఆప్షన్ ఆపరేటర్లకు ఎలా దొరికిందని మాజీ మంత్రి ప్రశ్నించారు. అమాయక రైతులకు నోటీసులు ఇచ్చి భయపెడుతున్నారని మండిపడ్డారు. లక్ష ఎకరాల ఎస్సీ, ఎస్టీ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని ఆరోపించారు. ఎన్నికల ముందు పట్టాలిస్తామని చెప్పి, ఇప్పుడు స్వాధీనం చేసుకున్నారని మాజీ మంత్రి విమర్శించారు. 'మా మీద సిట్‌లు వేసే బదులు ఈ స్కామ్‌పై సిట్, సిఐడీ విచారణ చేయాలి' అని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కాజీపేటలో నిర్మిస్తున్నది కోచ్ ఫ్యాక్టరీనా లేక వ్యాగన్ ఫ్యాక్టరీనా అనే దానిపై స్పష్టత లేదని హరీశ్ రావు పేర్కొన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అయితే కేంద్రం వెంటనే గెజిట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర లాథూర్‌కు ఒక న్యాయం, కాజీపేటకు మరొక న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని, లేకపోతే ఫ్యాక్టరీ ఓపెనింగ్‌కు వచ్చే బీజేపీ మంత్రుల పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. కాజీపేటను రైల్వే జోన్‌గా మార్చాలన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చొరవ చూపాలని, లాథూర్ తరహాలో రిజర్వేషన్లు ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యసభలో ఈ అంశాలపై బీఆర్ఎస్ కొట్లాడుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు.





దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సతీమణి శ్రీమతి విజయమ్మను, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే నెల 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి, నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వారికి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. -ప్రతిపక్షం, హైదరాబాద్



ఉద్యమకారులకు భరోసా

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన హుస్నాబాద్ ఉద్యమకారులు


ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి 28: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ గుర్తించి ఆదుకుంటామని, ఇందుకోసం ప్రత్యేక సబ్ కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ప్రకటనను హుస్నాబాద్ నియోజకవర్గ ఉద్యమకారులు స్వాగతించారు. ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం నియోజకవర్గ కన్వీనర్ మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశంలో వారు మాట్లాడుతూ, మంత్రి నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యమకారుల త్యాగాలను విస్మరించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో సానుకూలంగా స్పందించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. అయితే, ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సబ్ కమిటీ ఎలాంటి కాలయాపన చేయకుండా, కేవలం రెండు నెలల్లోనే నివేదికను రూపొందించాలని వారు కోరారు. జిల్లా కేంద్రాల్లో 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించడంతో పాటు, గృహ నిర్మాణానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులకు నెలకు రూ.25 వేల చొప్పున పెన్షన్ సౌకర్యం కల్పించాలని, విద్యార్థి ఉద్యమకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఐదు శాతం రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను పైలట్ ప్రాజెక్టుగా హుస్నాబాద్ నుంచే ప్రారంభించాలని వారు విన్నవించారు. అలాగే, ఉద్యమకారులకు ఉచిత బస్సు, రైలు ప్రయాణ సౌకర్యంతో పాటు మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక హెల్త్ కార్డులను అందించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారుల కోసం హైదరాబాద్‌లో ఉద్యమకారుల భవన నిర్మాణం నిమిత్తం 4 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు. ఉద్యమ సమయంలో ఎఫ్ఐఆర్ నమోదైన వారు, జైలుకు వెళ్లిన వారు, అలాగే బైండోవర్ అయిన వారిని కూడా అర్హులుగా గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ అంకుషవలి, పట్టణ అధ్యక్షుడు ఐలేని సంజీవరెడ్డి, సైదాపూర్ మండల కన్వీనర్ వస్తాదుల సదానందం, సిరంశెట్టి శ్రీనివాస్, గడ్డం స్వామి, వాల్వోజు జగదీశ్వర చారి, గంగం శ్రావణ్ కుమార్, రొళ్ల భాగ్య, వేలూరు స్వాతి, గుంటిపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వీహెచ్‌కు రాజ్యసభలో స్థానం కల్పించాలి

- జూబ్లీహిల్స్ సేవాదళ్ ప్రెసిడెంట్ దయం శేఖర్

ప్రతిపక్షం, జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 28: గాంధీ కుటుంబనికి విధేయుడు, మోస్ట్ సీనియర్ లీడర్ అయిన వి. హనుమంత్ రావుకు రాజ్యసభలో స్థానం కలిపించాలని జూబ్లీహిల్స్ సేవాదళ్ ప్రెసిడెంట్ దయం శేఖర్ కాంగ్రెస్ అధిష్టానానికి కి విజ్ఞప్తి చేశారు. హనుమంత్ రావు కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సవత్సరాలుగా సేవలు చే,స్తూ మా లాంటి యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు.తెలంగాణ భావాన్ని గట్టిగా విన్పించిన వీహెచ్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో పరిచయం అక్కరలేదని, ప్రతి గడపకి కాంగ్రెస్ వాదన్ని తన భుజన చేర్చిన వీహెచ్‌కు సమూచిత స్థానం ఇవ్వాలని కోరారు, ఈ కార్యక్రమంలో దయం శేఖర్తో పాటు శేక్పేట్ కాలనీ సేవదాల్ ప్రెసిడెంట్ వెంకటేష్, యువ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అన్ని రంగాల్లో విస్తరిస్తోన్న ఏఐ వల్ల ఉద్యోగాలు కనుమరుగవుతాయనే వాదన పెరుగుతోంది. అయితే కొన్ని అధిక జీతం వచ్చే పలు ఉద్యోగాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) భర్తీ చేయలేదు. పిల్లల సంరక్షణ, చిల్డ్రన్స్‌కు టీచింగ్, వృద్ధులను చూసుకోవడం, వ్యవసాయం, ఫారెస్ట్ రేంజర్స్, పూజారులు, క్లాసికల్ మ్యుజీషియన్స్‌కు మంచి డిమాండ్ ఉంటుంది. ఇలాంటి పలు ఉద్యోగాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) భర్తీ చేయలేదు.

- జొహో ఫౌండర్ శ్రీధర్ వెంబు

ఓపెన్ వాయిస్

ఎప్‌స్టీన్ ఫైల్స్.. పారదర్శకత ఎంతవరకు?

జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారులు, రాజకీయ నాయకులు, దేశాల అధ్యక్షులు, కంపెనీల అధినేతలు వణికిపోతున్నారు. ఎప్‌స్టీన్ కేసు మళ్లీ ప్రపంచాన్ని కుదిపేస్తోంది. గతంలోనే అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారితీసిన ఈ వ్యవహారం.. ఇప్పుడు కొత్తగా వెలుగులోకి వస్తున్న ఫైల్స్‌తో మరోసారి ప్రభావం చూపుతోంది. ప్రముఖ వ్యాపార, విద్యా, రాజకీయ రంగాలకు చెందిన వ్యక్తుల పేర్లు బయటకు రావడం, ఆ తర్వాత రాజీనామాల పరంపర మొదలవడం.. ఇది సాధారణ పరిణామం కాదు. ప్రపంచ స్థాయి సంస్థల విశ్వసనీయత, నైతిక ప్రమాణాలపై గంభీరమైన ప్రశ్నలను లేవనెత్తే పరిణామంగా ఇది మారింది. ఈ సందర్భంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూ ఈ ఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే రాజీనామా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ ఆర్థిక విధానాలను ప్రభావితం చేసే ప్రముఖ వేదికకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తి.. ఇలాంటి ఆరోపణల నడుమ తప్పుకోవడం సంస్థపై నేరుగా ప్రభావం చూపే అంశం. అమెరికా న్యాయ శాఖ విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బ్రెండే పేరు ప్రస్తావించబడడం.. ఆయన ఎప్‌స్టీన్‌తో భేటీ అయినట్లు ఆధారాలు బయటపడడం ఈ పరిణామానికి కారణమయ్యాయి. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలోనే ఆయన రాజీనామా చేయడం.. నైతిక బాధ్యతగా భావించవచ్చు. అయితే తన రాజీనామా లేఖలో ఈ అంశాన్ని నేరుగా ప్రస్తావించకపోవడం సందేహాలకు తావిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి రాజీనామా కథ కాదు. హార్వర్డ్ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ గ్రహీత రిచర్డ్ ఆక్సెల్, గోల్డ్‌మన్ శాక్స్ లీగల్ ఆఫీసర్ క్యాథీ రూమ్లెర్, హయత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్జ్కర్, డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ అహ్మద్, నార్వే అంబాసిడర్ మోనా వంటి ప్రముఖులు కూడా ఈ వివాదంతో తమ పదవులను వదులుకోవడం.. ఈ వ్యవహారం ఎంత విస్తృతంగా ఉందో తెలియజేస్తోంది. వ్యాపార దిగ్గజాలు, విద్యావేత్తలు, ప్రభుత్వ అధికారుల వరకు విస్తరించిన ఈ సంబంధాల నెట్‌వర్క్, అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకు కారణమవుతోంద ఈ పరిణామాల వల్ల ప్రధానంగా మూడు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మొదటిది ప్రపంచ ఎలైట్ వర్గాల మధ్య ఉన్న సంబంధాల స్వభావం. రెండవది నైతిక బాధ్యత అనే అంశం. మూడవది సంస్థల పారదర్శకతపై ఉన్న నమ్మకం. ఎవరైనా చట్టపరంగా తప్పు చేశారనే విషయం నిరూపించబడకపోయినా.. ప్రజా విశ్వాసాన్ని కాపాడుకోవడానికి నాయకులు రాజీనామా చేయాల్సిన పరిస్థితి రావడం.. నేటి ప్రపంచంలో నైతిక ప్రమాణాలు ఎంత కీలకమో చూపిస్తోంది. ప్రత్యేకంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వంటి సంస్థల విషయంలో ఈ అంశం మరింత ప్రాముఖ్యం సంతరించుకుంటుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే వేదికగా ఉన్న ఈ సంస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలి. అందుకే ఏ చిన్న వివాదం కూడా పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉంది. బ్రెండే స్థానంలో తాత్కాలికంగా అలోయిస్ జ్వింగీ బాధ్యతలు చేపట్టడం, సంస్థ కొనసాగింపుకు అవసరమైన చర్యగా కనిపిస్తున్నా, దీర్ఘకాలికంగా సంస్థ ప్రతిష్టను పునరుద్ధరించడం పెద్ద సవాలుగా మారింది. అదే సమయంలో ఈ ఫైల్స్ విడుదలలో పారదర్శకత ఎంత వరకు ఉందనే ప్రశ్న కూడా లేవనెత్తబడుతోంది. దర్యాప్తు వివరాలు పూర్తిగా బయటకు రాకపోవడం.. సమాచారం గోప్యంగా ఉంచడం ఇవి మరోవైపు అనుమానాలను పెంచే అంశాలు. ప్రజలకు పూర్తి నిజాలు తెలియజేయకపోతే, ఊహాగానాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. మొత్తం మీద ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం ఒక వ్యక్తి లేదా కొన్ని రాజీనామాలకే పరిమితం కాదు. ఇది ప్రపంచ ఎలైట్ వ్యవస్థలో ఉన్న బలహీనతలను బహిర్గతం చేస్తున్న సంఘటనగా చూడాలి. సంస్థల విశ్వసనీయత, నాయకుల నైతిక బాధ్యత, పారదర్శకత ఈ మూడు అంశాలు భవిష్యత్తులో మరింత కఠినంగా పరీక్షించబడే అవకాశం ఉంది. ఈ పరిణామాలు గ్లోబల్ స్థాయిలో పరిపాలనా విధానాలపై, నాయకత్వ ప్రమాణాలపై కొత్త చర్చలకు దారి తీస్తున్నాయి. ఎప్పుడు ఎవరి బాగోతం బయట పడుతుందో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ ఇప్పటికే తప్పు అంగీకరించాడు. ఇక డొనాల్డ్ ట్రంప్ కూడా ఇందులో ఉన్నాడు. అయితే తాజాగా బయటపడిన ఈ ఫైల్స్ కారణంగా పలు కంపెనీల దిగ్గజాలు కూడా ఉన్నారు. వీరు రాజీనామా బాట పడుతున్నారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
ఆదివారం
01.03.2026

హుండీలేని భక్తి మార్గానికి విలువల పునాది వేసిన సౌందర రాజన్



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

తెలంగాణలో భక్తి, సంప్రదాయ పరిరక్షణకు చిహ్నంగా నిలిచిన ఒక ఆశ్రమ శిల్పి సౌందర రాజన్. ఆయన అనూహ్య పరిమాణంలో మనసులు హత్తిన జీవన ప్రయాణం, ఆధ్యాత్మిక విలువలు, సమాజం సేవ, అర్చకుల మధ్య మార్గదర్శకత్వం, సంక్షోభాల పరిష్కార కర్తవ్యాలు.. ఇవి అంచనా వేయదగ్గ అంశాలు. ముఖ్యంగా చిలుకూరు బాలాజీ దేవాలయం వంటి ప్రసిద్ధి లభించిన క్షేత్రంలో ప్రధానార్చకుల వంశంతో అతడు కలిపి పర్యవేక్షించిన సేవలు, ఆయన సమాజంతో నిర్మించిన అనుబంధం, ఇతర అర్చకులకు ఇచ్చిన దిశానిర్దేశనలు మనం అధ్యయనం చేసుకోవాలి. సౌందర రాజన్ ఒక అర్చక కుటుంబంలో జన్మించారు. చిన్ననాటి నుండే వేదాధ్యయనం, ఆగమ పూజా క్రమాలు, ఆలయాశ్రమ సంప్రదాయాలపై అవగాహన పెరిగింది. అర్చక సంప్రదాయంలో "ధర్మం ముందుకు" అనే భావాన్ని ఆయన ఒక ఆచరణగా ప్రతిపాదించారు. భక్తి ప్రకటనలే కేవలం పూజా పెద్ద ఉత్సవాలు కాదు; అర్చకులు తమ సేవా విధానంలో మౌన నిబద్ధతను, వినయాన్ని, సమకూరిన సమాజ సేవ భావాన్ని కలిగివ్వాలి అని చెప్పేవారు. ఈ నిబద్ధత విశ్వాసం, ఆచారపరమైన క్రమశిక్షణ, పూజా విధానాల పారదర్శక నిర్వహణ ఇవి ప్రధాన సూత్రాలు. చిలుకూరు క్షేత్రలో హుండీలు లేని విధానం, ప్రత్యక్ష-పరోక్ష ప్రకటనలకు దూరంగా, భక్తి ప్రధానంగా తప్పకపోయినా ఒక ప్రత్యేక ధోరణిగా ఈ ప్రాంతాన్ని నిలబెట్టింది. ఈ అందాన్ని శాఖలుగా పంపిణీ చేసే కార్యాచరణలో ప్రధానార్చకుల వంశం, ముఖ్యంగా సౌందర రాజన్ వంటి పెద్దలు ముఖ్యపాత్ర పోషించారు. వారు అనేక అర్చకులతో పంచుకున్న శిక్షణ కార్యక్రమాలు, ఆచార నిర్వహణకు సంబంధించిన శాసనాలు ఇవి కేవలం పూజామాట్లే కాకుండా, సమాజం పట్ల బాధ్యతను బోధించే గురుత్వాన్ని ఏర్పరచేవి. సౌందర రాజన్ ప్రత్యేకత కూడా ఇక్కడే. ఆయన అర్చక వృత్తిని కేవలం ఒక పనిగా చూడలేదు; అది ఒక జీవనగా భావించారు. ఏ ఆలయంలో కాకుండా, ప్రత్యేకంగా చిలుకూరు వంటి సాంప్రదాయ ప్రతిష్ఠలతో ఉన్న క్షేత్రంలో ఆ ధోరణి మరింత స్పష్టమయ్యింది. ఆయన కుటుంబంలోని ఇతర అర్చకులతో కలిసి నిర్వహించిన శిక్షణ శిబిరాలు, వేద-ఆగమ శాస్త్రాలపై ప్రశ్నోత్తరాలు, పూజా నిబంధనలలో నిష్పక్షపాతత ఈ కార్యక్రమాలు సమకాలీన అర్చకులకు ఒక మార్గదర్శకంగా నిలిచాయి. సౌందర రాజన్ ఇచ్చిన మార్గదర్శకత్వం అత్యంత సంబంధితది కేవలం ఆ కుటుంబానికి కాదు; దేశవ్యాప్తంగా ఉన్న అర్చక సమాజానికి. స్వజనులతో, చిన్న అర్చకులతో ఉండే సమస్యలకు ఆయన ఇచ్చిన పరిష్కారాలు ప్రాథమిక సందేశాలు. ఉదాహరణకు: భక్తుల ఆందోళనను అర్థం చేసుకొని, పూజా క్రమాన్ని మరింత సమీకృతం చేయడం, పూజా ఉపకరణాల శుద్ధి నియమాలను క్లుప్తంగా మరియు అందరికీ అర్థమయ్యేలా చేయడం—ఇవి సాధారణంగా పెద్ద సమస్యలు కాకపోయినా, అనేక ఆలయాల్లో అవగాహన లేకపోవడానికి కారణమయ్యే అంశాలు. సౌందర రాజన్ వంటి వ్యక్తులు ఈ చిన్న-చిన్న అనర్థాలపై శ్రద్ధ పెట్టి పరిష్కరించే ప్రయ



త్నం చేశారు. ఈ ప్రయత్నాలు పర్వదినాల్లో, ప్రధాన పూజా కార్యక్రమాల్లో కాకుండా, నిత్య నిర్వహణలో భక్తులకు ఆశాకిరణంలా నిలిచాయి. ఆధ్యాత్మిక సేవలో సమస్యలు వచ్చినప్పుడల్లా ఆయన సమానత్వ భావంతో స్పందించారు. సామాన్య భక్తుడి ప్రశ్నలను బహుళచర్చల్లో పరిష్కరించారు. అర్చక వర్గం మధ్యలో ఎదురయ్యే అభ్యంతరాలు, ఆచారపరంగా ఏర్పడే సందేహాలు, పూజా విధానాల పునర్నిర్మాణం వంటి అంశాలలో సౌందర రాజన్ నటించిన మండలి పాత్ర విశేషంగా గుర్తించదగినది. ఈ సమకాలీన సంబంధాల పరిష్కారంలో ఆయన వివిధ అర్చకులతో కోలాబరేషన్ చేయడం, ప్రయోజనాలను ఒకే దృక్పథంలో ఏకీకృతం చేయడం.. ఇవి ఆయన ప్రత్యేక లక్షణాలు. అర్చకులు సాధారణంగా ఒకే పద్ధతులను పాటిస్తూ సమాజ సేవను చేస్తుంటారు. అయితే సమాజంలో సాంఘిక-ఆర్థిక మార్పులతో ఆలయాల నిర్వహణపై కొత్త పీడలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సౌందర రాజన్ వంటి ప్రముఖులను అంచనా వేయాలి. ఆయన పూజా నిర్వహణలో పారదర్శకత, సమాజంతో సమన్వయం, అనువర్తన క్రమ పద్ధతులు.. ఇవి ఒక పునాది. ఇతర అర్చకులు, ప్రత్యేకంగా యువ అర్చకులు, ఈ పునాదిపై తమ సేవా విధానాలను నిర్మించారు. ఆ విధానం భక్తుల విశ్వాసం, ఆలయ నిర్వహణలో న్యాయపరమైన ప్రమాణాలు, సమాజ బాధ్యత.. ఇవి కలిపి ఒక సమగ్ర సేవా ధోరణిని ప్రకటిస్తుంది. సౌందర రాజన్ ఇచ్చిన దారి ప్రయాణంలో చిక్కులు తప్పలేదు. భక్తులు, సమాజం మధ్య సమన్వయ సవాళ్లు, ఆచారపరమైన నిర్దేశాలపై అభిప్రాయ విభేదాలు, పూజా నిర్వహణలో నూతన పద్ధతుల అవసరం వంటి సమస్యలు ఎదురయ్యాయి. వీటిని ఎదుర్కొని పరిష్కరించిన విధానం.. సానుభూతి, వినయం, శాస్త్రపు అవగాహన.. ఆ నాలుగు ప్రధాన సూత్రాల ద్వారా సాధించారు. ఇతర అర్చకులు కూడా ఈ సూత్రాలను అనుసరించి సమస్యలను సమాధానమయ్యేలా మార్చుకున్నారు. ఈ ప్రక్రియ కేవలం ఒక ఆలయ క్షేత్ర పరిమితి కాదు; దేశవ్యాప్తంగా ఉన్న సంప్రదాయాల సంరక్షణలో ఒక మార్గదర్శకమయిన ఉదాహరణగా నిలిచి ఉంది. సౌందర రాజన్ మరణంతో ఒక్కటి స్పష్టమైంది: ఈ ప్రపంచం శాశ్వతమైనది కాదు కానీ మన సేవ, మన మార్గం, మన శ్రద్ధ.. ఇవి వ్యక్తులదగ్గర ఉన్న విలువలను నిలబెట్టగలవు. చిలుకూరు బాలాజీ క్షేత్రంలో ఈ విలువలు పరిరక్షించబడి, వృద్ధిచేయబడి, భక్తుల జీవితాల్లో స్వతంత్ర భావనగా నిలిచాయి. ఇకపై అర్చకులు, ముఖ్యంగా యువత, ఈ విలువలను తమ సేవా విధానంలో అనుసరించాలి. సౌందర రాజన్ ఇచ్చిన దిశానిర్దేశం, సమస్యల పరిష్కారమార్గాలు, ఆధ్యాత్మిక గౌరవం.. ఈ మూడు అంశాలు ఈరోజు అర్చక సమాజంలో కొనసాగుతున్న పునాది. మరణం సమానంగా అందరికీ.. కానీ ఒక వ్యక్తి జీవితం నిరూపించిన మార్గం మరణంతో అంతం అవదు. సౌందర రాజన్ వంశపారంపర్య విలువలు, ఆధ్యాత్మిక నిబద్ధత, సమాజ సేవకు ఇచ్చిన ప్రాధాన్యత.. ఇవి ఆయనే పునాది. ఈ పునాది మరింత సుదీర్ఘంగా, మరింత ఆదర్శంగా కొనసాగుతుంది. సౌందర రాజన్ జీవితం, ఆయన సేవలు, మార్గదర్శకత్వం, సమస్యల పరిష్కార విధానం.. ఈ అంశాల సమగ్ర విశ్లేషణ నుండి సమాజం తేలికగా నేర్చుకోగల ముద్రలు ఉన్నాయి. ఈ ముద్రలు సమాజ సేవలో మరింత ఉన్నతస్థాయికి నడిపించగలవు అని మనం నమ్మాలి.

(వ్యాసరచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

కక్షసాధింపు రాజకీయాలకు చెంపపెట్టు.!



వెంక గారి భూమయ్య
9848559863

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధమైన దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఉండాలి. కానీ, గత దశాబ్ద కాలంగా కేంద్రంలోని బిజెపి అగ్రనేతలు ఈ సంస్థలను తమ రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగించే వేట కుక్కల్లా, ప్రతిపక్షాలను వేధించే ఆయుధాల్లా మార్చేశారనే విమర్శలకు రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తాజా తీర్పు ఒక తిరుగులేని సాక్ష్యంగా నిలిచింది. ఢిల్లీ లిక్కర్ స్కాం పేరుతో బిజెపి వ్యూహకర్తలు సృష్టించిన ఒక భారీ మాయాజాలం, కల్పిత కథనం ఇప్పుడు న్యాయస్థానం ముందు పేకమేడలా కూలిపోయింది. బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలకు కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడం కేవలం ఒక తీర్పు మాత్రమే కాదు.. అది బిజెపి అగ్రనేతల నైతిక పతనానికి మరియు వారి నీచమైన రాజకీయ క్రీడకు పరాకాష్ట.

రాజకీయ కక్షే దర్యాప్తునకు ఇంధనమా?

ఏదైనా కేసులో దర్యాప్తు జరగాల్సింది నిజానిజాలను నిగ్గుతేల్చడం కోసం. కానీ బిజెపి హయాంలో దర్యాప్తు సంస్థలు పని చేస్తున్నది కేవలం 'రాజకీయ యజమానుల' అజెండాను అమలు చేయడం కోసమేనని ఈ తీర్పుతో సుస్పష్టమవుతోంది. కల్వకుంట్ల కవితను ఈ కేసులో ఇరికించిన తీరు చూస్తే, అది పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిన రాజకీయ కుట్రగా అనిపిస్తుంది. తెలంగాణలో కేసీఆర్ ప్రభావాన్ని నేరుగా ఎదుర్కోలేక, బీఆర్ఎస్ పార్టీని జాతీయ స్థాయిలో ఇబ్బంది పెట్టాలనే కుటిల బుద్ధితోనే కవితను లక్ష్యంగా చేసుకున్నారు. ఒక మహిళా నేత అని కూడా చూడకుండా, ఎటువంటి పక్కా ఆధారాలు లేకుండా, కేవలం అప్రూవర్ల వాంగ్మూలాల ఆధారంగా ఐదు నెలల పాటు జైల్లో ఉంచి వేధించడం బిజెపి అగ్రనేతల కరుడుగట్టిన కక్షసాధింపు రాజకీయాలకు నిదర్శనం. రాజకీయ ప్రయోజనాల కోసం ఒక వ్యక్తి స్వేచ్ఛను హరించడం, వారిని జైలు పాలు చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు.

ఆధారాలు లేని 'సీబీఐ' నాటకం – కోర్టు ఆగ్రహం

దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలు దాఖలు చేసిన వేల పేజీల ఛార్జ్‌షీట్లలో అసలు 'మెరిట్' లేదని కోర్టు తేల్చి చెప్పడం ఈ వ్యవస్థల పతనాన్ని సూచిస్తోంది. 23 మంది నిందితులపై ఇసుమంతైనా సాక్ష్యాధారాలు చూపడంలో విఫలమైన సీబీఐ తీరుపై రౌస్ అవెన్యూ కోర్టు వ్యక్తం చేసిన ఆగ్రహం.. ఢిల్లీ పెద్దలకు చెంపపెట్టు. "ఆధారాలు లేకుండానే రాజకీయ నేతలను ఇరికించారు" అని న్యాయస్థానం వ్యాఖ్యానించిందంటే, కేంద్ర పెద్దలు దర్యాప్తు సంస్థలపై ఏ స్థాయిలో ఒత్తిడి తెచ్చారో సామాన్యులకు కూడా అర్థమవుతుంది. కేవలం రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిత్వ



హననం చేయడానికి, వారిని ప్రజల ముందు దోషులుగా నిలబెట్టడానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని, దర్యాప్తు సంస్థలను కీలుబొమ్మలుగా వాడుకోవడం బిజెపి అగ్రనేతల అసహనానికి సంకేతం.

సోషల్ మీడియా వికృత క్రీడ, వ్యక్తిత్వ హననం

ఈ కేసు సాగుతున్న మూడేళ్ల కాలంలో బిజెపి ఐటీ సెల్ సాగించిన వికృత క్రీడ దేశ చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయం. కోర్టులో నేరం నిరూపణ కాకముందే కవితను, కేజ్రీవాల్‌ను మహా దోషులుగా చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో ట్రోల్స్ చేయించడం, నీచమైన ఆరోపణలు గుప్పించడం వెనుక ఉన్నది కమలం పార్టీ అగ్రనేతలే అన్నది జగమెరిగిన సత్యం. "కడిగిన ముత్యంలా బయటకు వచ్చాను" అని కవిత అన్న మాటల్లో ఒక బాధితురాలి ఆవేదనతో పాటు, అబద్ధంపై గెలిచిన సత్యం తాలూకు గంభీర్యం కనిపిస్తోంది. తన కుటుంబం, తన తండ్రి కేసీఆర్ మరియు పార్టీని టార్గెట్ చేయడానికి బిజెపి ఆడిన ఈ నాటకంలో చివరకు న్యాయమే విజయం సాధించింది.

ప్రజాస్వామ్య వ్యవస్థల దుర్వినియోగం

ప్రతిపక్ష నేతలను జైలుకు పంపితే వారి పార్టీలు కుప్పకూలుతాయని, ఆ భయంతో నేతలు తమ పార్టీలో చేరుతారని బిజెపి పెద్దలు వేసుకున్న రాజకీయ లెక్కలు ఈ తీర్పుతో తలకిందులయ్యాయి. అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలను కేసు నుంచి డిశ్చార్జ్ చేయడం ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీపై మోపిన నిందలు కూడా చెరిగిపోయాయి. అధికారం శాశ్వతం కాదని, వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తే చరిత్ర క్షమించదని బిజెపి అగ్రనేతలు ఇప్పటికైనా గ్రహించాలి. దర్యాప్తు సంస్థలు రాజ్యాంగానికి జవాబుదారీగా ఉండాలి తప్ప, పార్టీ ఆఫీసుల ఆదేశాలకు కాదు.

కేంద్ర పెద్దల కపటనీతి బట్టబయలు

నిజం నిప్పులాంటిది, అది కాసేపు అబద్ధపు పొగతో కప్పబడవచ్చు కానీ, శాశ్వతంగా వెలుగు చూడకుండా ఆగదు. లిక్కర్ కేసు పేరుతో సాగించిన ఈ మారణహోమం, రాజకీయ నాయకులపై చేసిన వ్యక్తిత్వ హననం ఇప్పుడు న్యాయస్థానం సాక్షిగా తుడిచిపెట్టుకుపోయాయి. బిజెపి అగ్రనేతలు పన్నిన పద్మవ్యూహాన్ని ఛేదించుకుని కవిత, కేజ్రీవాల్ కడిగిన ముత్యాల్లా బయటకు రావడం ప్రజాస్వామ్యవాదులకు గొప్ప ఊరట. రాజకీయంగా ఎదుర్కోలేక అడ్డదారులు తొక్కిన బిజెపి నేతలు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వెళ్తారో చెప్పాలి.

బీజేపీ అరాచక రాజకీయాలపై దేశవ్యాప్త ఆగ్రహం

ఈ తీర్పుతో బిజెపి వేసిన 'లిక్కర్ ఉచ్చు' రివర్స్ అయి, ఆ పార్టీ అగ్రనేతల మెడకే చుట్టుకుంది. కేవలం రాజకీయ అధికారం కోసం వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తూ, పచ్చి అబద్ధాలతో ప్రత్యర్థుల జీవితాలతో ఆడుకుంటున్న కేంద్ర పెద్దల తీరుపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. "రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను ఇంత నీచంగా వాడుకుంటారా?" అని సామాన్య ప్రజలు సైతం బీజేపీని నిలదీస్తున్నారు. ఈ తీర్పు కేవలం కవితకో, కేజ్రీవాల్‌కో వచ్చిన ఊరట మాత్రమే కాదు.. ఇది బీజేపీ మార్కు అరాచక రాజకీయాలకు దేశ ప్రజలు ఇస్తున్న గట్టి సంకేతం. ఇప్పటికైనా కేంద్రం తన కక్షసాధింపు ధోరణిని వీడకపోతే, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కమలనాథులకు ప్రజలు రాబోయే రోజుల్లో బ్యాలెట్ బాక్సుల ద్వారా సరైన బుద్ధి చెప్పడం ఖాయం. అబద్ధపు పునాదుల మీద నిర్మించిన బీజేపీ రాజకీయ సామ్రాజ్యం కూలిపోయే రోజులు దగ్గరపడ్డాయని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

అవయవదాతలకు సముచిత గౌరవం కల్పించాలి



సుధాకర్.ఏ.వి
9000674747

మనిషి మరణించినా అతని హృదయం స్పందిస్తుంది. ఊపిరితిత్తులు శ్వాసిస్తుంటాయి. నేత్రాలు వీక్షిస్తుంటాయి. మూత్రపిండాలు మరొకరిలో రక్తశుద్ధి చేస్తునే ఉంటాయి. ఇలా... మనిషి మృతి చెందినా సరే. అతని శరీరంలోని అవయవాలు మరికొందరికి పునర్జన్మను ప్రసాదిస్తున్నాయి. గత పుష్కరకాలంలో దేశంలో అవయవదానం గణనీయంగా పెరిగిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల వెల్లడించిన నివేదికల ప్రకారం 2013లో అవయవదాతల సంఖ్య 5వేల లోపే ఉండగా 2025లో నాలుగు రెట్లు పెరిగి 20 వేలకు చేరడం శుభపరిణామం. కేరళలో ఇటీవల 10 నెలల పాపను వైద్యులు బ్రెయిన్ డెడ్ గా నిర్ధారించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్నా కుటుంబ సభ్యులు ఆ చిన్నారి అవయవాలను దానం చేశారు. ఆ పాప వల్ల నలుగురి ప్రాణాలు నిలబడ్డాయి. చిన్నారికి కేరళ సర్కారు అధికార లాంఛనా లతో అంత్యక్రియలు నిర్వహించడం దేశవ్యాప్తంగా అవయవదానం తెరపైకి వచ్చింది. తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అవయవదాతల కుటుంబాలకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని ఉత్తర్వులు జారీ చేయడం ముదావహం. తెలంగాణ రాష్ట్రంలో సైతం అవయవదాతలను తగిన రీతిలో గౌరవించాలని వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసినా అవి అమలు కావడం లేదు. రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులు, జిల్లాల్లో కలెక్టర్లు అవయవదాతల కుటుంబసభ్యులను సముచితంగా గౌరవిస్తే దాతల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఇటీవల ప్రభుత్వం అన్ని టిమ్స్ ఆసుపత్రుల్లో ఆర్గాన్ డొనేషన్ కోసం ప్రత్యేక థియేటర్లను ఏర్పాటు చేయడం హర్షణీయం. దీనితో పాటు అన్ని సర్కారు ఆసుపత్రుల్లో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేస్తే అవయవదాతలు పెరిగే అవకాశం ఉంటుంది. జాతీయ స్థాయిలో జీవన్‌దాన్ ట్రస్టు శరీర, అవయవదానాలు స్వీకరిస్తోంది. భారత్‌లో అవయవదానం, శరీర దానంపై 1994లోనే చట్టం తీసుకొచ్చారు. ఎన్ని చట్టాలువచ్చినా ఇంకా అవయవాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. అవయవాలు దొరకక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. అవయవ దానం జీవించి ఉన్న దాత నుంచి లేదా బ్రెయిన్ డెడ్ అయిన దాత నుంచి జరగవచ్చు. బ్రెయిన్ డెడ్ అనేది రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయం కావడం వల్ల లేదా మరే కారణం చేతనైనా మెదడులో రక్తనాళం చిట్లడం వల్ల సంభవిస్తుంది. శాశ్వతంగా మెదడు పని చేయకపోవడాన్ని బ్రెయిన్‌డెత్‌గా నిర్ధారిస్తారు. మనందరికీ తెలిసినట్టుగా, మెదడు మొత్తం శరీరానికి నియంత్రణ కేంద్రంగా పనిచేస్తుంది. కాబట్టి మెదడు సరిగ్గా పనిచేయకపోతే మొత్తం శరీరం పనిచేయకుండా పోతుంది. కొన్ని వైద్య పరీక్షల ద్వారా, మెదడు మరణాన్ని నిర్ధారించవచ్చు. రోగి మెదడు అప్పటికే మరణించినట్టు చట్టపరమైన ప్రకటన ఉంటే అవయవ మార్పిడి ప్రక్రియను వెంటనే ప్రారంభిస్తారు. ఊపిరితిత్తులు, గుండెను ఆరు గంటలలోపు, మూత్రపిండాలను 48 గంటలలోపు, కళ్లను ఆరు గంటలలోపు, కాలేయంను 12 గంటల్లోపు వేరే వారికి అమర్చితేనే అవి యథావిధిగా పని చేస్తాయి. ఏ ఆసుపత్రిలోనైనా బ్రెయిన్ డెడ్ అయి కోమాలో ఉన్న వ్యక్తి అవయవాలు దానం చేయాలంటే సంబంధిత ఆసుపత్రి నుంచి సమాచారం ఇస్తే అక్కడ నుంచి ప్రత్యేక వైద్య బృందం వచ్చి పరిశీలించి గంటల వ్యవధిలోనే కోమాలో ఉన్న వ్యక్తి అవయవాలను గ్రీన్ ఛానల్ ద్వారా తీసుకువెళ్ళి ముందుగా వారి వద్ద రిజిస్టర్ కాబడిన అవయవాలు కావాల్సిన వారికి అమర్చుతారు. దేశవ్యాప్తంగా 1200 కుటుంబాలు తమ ప్రియమైనవారి అవయవాలు దానం చేసి ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు గొప్ప మనసుతో ముందుకొచ్చాయి. అత్యధిక అవయవదానం చేసే రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. జాతీయ సగటు కన్నా ఇది ఎక్కువ. కానీ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన దగ్గర జీవన్మృతుల కుటుంబాలకు సరైన గుర్తింపు, గౌరవం దక్కడం లేదని అంతా భావిస్తున్నారు.



(వ్యాసకర్త స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

రాజకీయ కక్షలతోనే అక్రమ అరెస్టులు

- తప్పుడు కేసులపై హెచ్ఆర్సీలో ఫిర్యాదు చేస్తా
- పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల వ్యవహరిస్తున్నారు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 28 : గత మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జరిగిన రాజకీయ గొడవల కారణంగా రాజకీయ కక్షలతోనే భారత రాష్ట్ర సమితి నాయకులు కార్యకర్తల పైన కేసులు నమోదు చేసి జైలు పాలు చేస్తున్నారని అక్రమ అరెస్టులతో పార్టీ కార్యకర్తలను జైల్లో పెట్టడం జరుగుతుందని ఇప్పటికే 13 మంది కార్యకర్తలను జైల్లో పెట్టారని అక్రమంగా కేసులు పెట్టి భారత రాజ్యసమితి నాయకుడు మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ సైతం అక్రమంగా కేసులు పెట్టడం జరిగిందని భారత రాష్ట్రసమితి జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్రెడ్డి అన్నారు శనివారం కోర్టు ముందు ఆమె మీడియాతో మాట్లాడుతూ మెదక్ పట్టణ పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల ఎవరిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే. అతని తండ్రి ఇద్దరు కలిసి మెదక్ లో రాజకీయ అలజడిని రేపుతున్నారని రాజకీయ కక్షలతో అక్రమ కేసులు బనాయిస్తున్నారని భారత రాష్ట్ర సమితి నాయకులు కార్యకర్తలు కేసులు పెడితే పోలీసులు తీసుకోవడం లేదని రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ నియోజకవర్గం లో స్థానిక ఎమ్మెల్యే రాజకీయ కక్షలతోనే ఎవరిస్తున్నారని ఆమె తీవ్రంగా విమర్శించారు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎక్కడ కూడా ఎన్నికల నియమ నిబంధనలు పాటించలేదని దానికి పోలీసులు వతస్తు పలికారని ఆమె తీవ్రంగా విమర్శించారు. భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తలైన ఎస్సీలపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే రాజకీయంగా ఎదుర్కోలేక అధికారాన్ని అడ్డం పెట్టుకొని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అక్రమ కేసులు పెడుతున్నారని ఎమ్మెల్యే పైదాడి చేసిన కేసులో హైకోర్టులో బెల్ వచ్చిన కొత్త కేసులు పెట్టి పోలీసులతో అక్రమ కేసులు బనాయించడం జరుగుతుందని ఆమె తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడును పోలీసులు తీసుకువచ్చిన విధానం ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లవారుజామున 6 గంటలకు పదుల సంఖ్యలో పోలీసులు ఇంట్లో దొరి ఇంట్లో ఉన్న అమ్మ భార్య పిల్లలను భయపెట్టి అక్రమంగా అరెస్టు చేసి తీసుకెళ్లడం పై తమ చట్టప్రకారం సదరు అధికారులపై హెచ్ఆర్జీలో కంప్లీట్ చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. న్యాయపరంగా పోరాటం చేస్తామని ఆమె తెలిపారు. తమకు చట్టాలపై గౌరవం ఉందని, చట్టాల అనుసరిస్తూ మా కార్యకర్తలను, నేతలను కాపాడుకుంటామని పేర్కొన్నారు. అక్రమ కేసులకు ఎవరు భయపడవద్దని పార్టీ నేతలకు కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు అరెస్టు చేయడం జరిగిందని న్యాయవాదికి ఫోన్ చేశానన్న ఒప్పుకోలేదని పోలీసులు గుచ్చుకోనీ స్విచ్ ఆఫ్ చేయడం జరిగిందని తన తల్లిని భార్య పిల్లలను అడ్డువస్తే కేసులు పెడతామని భయభృతులకు గుర్తించాలని తన వెంట రావాలని పోలీసులు జారీ చేశారని ఏ కేసులో అరెస్టు చేస్తున్న తెలపాలని చెప్పిన పోలీసులు వినకుండా అరెస్టు చేయడం జరిగిందని పట్టణ పోలీస్ స్టేషన్ వెళుతున్న క్రమంలో ఎక్కడికి తీసుకెళ్తున్నారని అడిగిన సమాధానం చెప్పకుండా మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్లో అక్రమంగా బంధించారని ఆయన తెలిపారు. గత మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జరిగిన రాజకీయ గొడవల కారణంగా 13 మందిని అరెస్టు చేయడం జరిగిందని వారి కుటుంబాలు దీన వ్యవస్థలో ఉన్నాయని నీ వారి వంట పొలాలు ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఎస్సీ కార్యకర్తల పైన అడ్రస్తి కేసులు పెట్టడం ఎంతవరకు సభబు అని ఆయన సూటిగా ప్రశ్నించారు. తనను అరెస్టు చేసి క్రమంలో హాస్పటల్ కి తీసుకెళ్తే అక్కడ బిపి మెషిన్ పనిచేయడం లేదని నిత్యం నిరుపేదలు వచ్చే ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో రోగులు ఇబ్బందులు పడుతుంటే స్థానిక ఎమ్మెల్యే మాత్రం రాజకీయ కక్షలు అంటూ పోలీసులను అధికారాన్ని అడ్డం పెట్టుకొని మాపై రాజకీయ కక్షలు పాల్పడడం జరుగుతుందని ఆయన తీవ్రంగా విమర్శించారు పోలీసులు వివరించిన తీరు చాలా దురదృష్టకరమని ఆయన అన్నారు. ఈ మీడియా సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి. న్యాయవాది జీవన్రావు మెదక్ పట్టణ కౌన్సిలర్లు దీపక్ కుమార్ నవీన్ నాయకులు లింగారెడ్డి. బట్టి జగపతి. గడ్డమీది కృష్ణ గౌడ్. స్వామి నాయక్.కాసాపురం మధు తదితరులు పాల్గొన్నారు.



కాకతీయ లో ఘనంగా జాతీయ సైన్ దినోత్సవం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 28 : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్లో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని, విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థినీ,విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు చేసి,బాల శాస్త్రవేత్తలుగా మారి ఔరా!అనిపించి, అబ్రపరిచారు. సైన్స్ ప్రాజెక్టను పరిశీలించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ప్రముఖులు పాఠశాలలో విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను చూసి అభినందించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిస్మాట్ స్టేట్ జనరల్ సెక్రటరి జగ్గు మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ...నేటి బాలలే రేపటి పౌరులు,ఈరోజు చేసిన సైన్స్ పరికరాలు రేపటి శాస్త్రవేత్తలుగా మారుస్తాయని ఉద్బోదించారు. విద్యార్థులు చిన్ననాటి నుండే మహాత్ముల అడుగుజాడల్లో పయనించి, గొప్పవారిగా ఎదగాలని ఆకాంక్షించారు.ఇలాంటి కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహించడం వల్ల,విద్యార్థులలోని సృజనాత్మకత బయటపడి వారిని ఉన్నతులుగా తయారు చేస్తుందన్నారు. అందుకోసం ప్రతి తల్లిదండ్రులు విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తూ, వారిని నిరంతరం మంచి విషయాలను బోధించే, పాఠశాలలో చేర్పించాలన్నారు.కార్యక్రమంలో విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రాజెక్టులకు నగదు బహుమతులతో పాటు మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత,ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రముఖులు ,పాల్గొన్నారు.



దుబ్బాక ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై
దాడి సరికాదు

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 28 : దుబ్బాక 100 పడకల ఆసుపత్రి సూపర్డెంట్ పై దాడి హేయమైన చర్య అని అఖిలపక్షం నాయకులు అన్నారు. శనివారం దుబ్బాక పట్టణంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దుబ్బాక 100 పడకల ఆసుపత్రిలో అనేక రకాలైన అత్యవసర సేవలు అందిస్తూ, ఈ ప్రాంత ప్రజలకు అనేక రకాలైన వైద్య సేవలు అందిస్తూ ఈ ప్రాంతంలో ప్రాణదాతగా పనిచేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ హేమరాజ్ సింగ్ పై వ్యక్తిగత కక్ష పెంచుకొని దాడులు చేస్తున్న వారి పై కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దుబ్బాక వంద పడకల ఆసుపత్రిలో అనేక ఎక్యుమెంట్స్ లేకున్నా 24/7 సర్వీస్ అందించే వైద్యులు లేకున్నా ,సూపర్డెంట్ హేమరాజ్ సింగ్ అత్యవసర సేవలు అందిస్తున్నారని తెలిపారు.ఇట్టి దాడి విషయంలో వంద పడకల ఆసుపత్రి చైర్మన్ గా ఉన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కఠినంగా వ్యవహరించి టీ న్యూస్ ప్రతినిధి పైన చట్టపరమైన చర్యలు తీసుకునేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు.ఇట్టి విషయాన్ని జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగాచారి దృష్టి కి కూడా తీసుకెళ్లామని వారు ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ , దుబ్బాక మున్సిపాలిటీ 14వ వార్డ్ కౌన్సిలర్ తునికి సురేష్, బిజెపి పట్టణ అధ్యక్షుడు దొర గళ్ళ శ్రీకాంత్, బిజెపి రెండో వార్డ్ కౌన్సిలర్. గంభీర్ పూర్ కౌన్సిలర్ కనకరాజు, నాయకులు సుంకోజు ప్రవీణ్, నక్క బాల వెంకన్న, దుంపలపల్లి రవీందర్, రమేష్ రెడ్డి, పల్లె మనోజ్ ,మల్లుగారి రమణారెడ్డి, ఆకుల నరేష్, ఎల్లం గారి లింగారెడ్డి తది తరులు పాల్గొన్నారు.

దళితులపై అక్రమ కేసులు దుర్మార్గం

డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి.

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 28: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం గద్దెను నిర్మిస్తున్న అంబేద్కర్ సంఘ నాయకుల పైన అక్రమ కేసులు బనయించడం దుర్మార్గమని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఏగొండ స్వామి మాట్లాడుతూ నాచారం గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు చేస్తున్న గద్దెకు ఇరువైపులా దాదాపు 26 ఫీట్ల దారి ఉన్నప్పటికీ అనవసరంగా అంబేద్కర్ సంఘ నాయకులను ఇబ్బంది పెట్టాలని, బాబాసాహెబ్ అంబేద్కర్ భావజాలాన్ని వ్యాప్తి చెందకుండా నిరాకరించడం కోసం అక్రమ కేసులు బనాయించి తాత్కాలిక ఆనందం పొందడం దుర్మార్గమన్నారు. వెంటనే ఉన్నత అధికారులు స్పందించి అంబేద్కర్ విగ్రాహ కమిటి నాయకుల పైన బనయించినటువంటి కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పాలన కొనసాగిస్తున్న ప్రభుత్వాలు ఆయన విగ్రహాలకే రక్షణ లేకుండ అంక్షాలు పెడితే మిగితా విగ్రహాల పరిస్థితి ఎట్లుంటదని ప్రశ్నించారు. వెంటనే అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల దళిత బహుజన సంఘాలు ఏకమై జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ల్యాతోల్లా వెంకటేష్, ప్రధాన కార్యదర్శి భక్కోల్ల కృష్ణ, కొనయ పల్లి ప్రభాకర్, మంగని నరేష్, గూడూరి రాజు, పులి నరేష్, గూడూరి బాబు, కూచారం భగత్ , గూడూరి సత్యనారాయణ, కొనాయపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున గౌడ్ అరెస్ట్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 28 : గత మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జరిగిన గొడవలు అరెస్టుల పర్వం ఆగడం లేదు శనివారం తెల్లవారుజామున మెదక్ పట్టణ పోలీసులు మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున గౌడ్ ను తెల్లవారుజామున ఇంట్లో అరెస్టు చేసి మెదక్ పట్టణ పోలీసులు రూరల్ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో చోటుచేసుకున్న ఘటనపై నమోదైన కేసుల్లో హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ మంజూరైంది. కాగా శనివారం తెల్లవారుజామున పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మల్లిఖార్జున్ గౌడ్ను అరెస్ట్ చేయడం రాజకీయ కక్షలో భాగంగానే జరిగిందని ప్రజలు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అరెస్టు విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నేతలు రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలి వెళ్లారు. అయితే ఏ కేసులో అదుపులోకి తీసుకున్నారు. మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్ సంప్రదించగా పాత కేసులలో అరెస్టు చేయడం జరిగిందని. రిమాండ్ కు తరలించడం జరిగిందని ఆయన తెలిపారు.



సహాధ్యాయి కుటుంబానికి అండ

రూ.21 వేల ఆర్థిక సాయం
ఉదారత చాటుకున్న పూర్వ విద్యార్థులు

ప్రతిపక్షం, నంగునూరు, ఫిబ్రవరి 28 : తమతో కలిసి చదువుకుని చనిపోయిన తోటి విద్యార్థి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. తమకు తోచిన ఆర్థిక సాయం చేసి ఆత్మీయ స్నేహితుడికి నివాళులు అర్పించారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గుండా రజనీకర్ మూడు రోజుల కిందట అనారోగ్యంతో మరణించారు. గుండా రాజుతో కలిసి నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 2000 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదువుకున్న తోటి విద్యార్థులు శుక్రవారం గుండా రజనీకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రజనీకర్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని తక్షణ సాయం కింద రూ.21,000 వేల రూపాయలు వారి కుటుంబానికి అందించి తమ ఉదారతను చాటుకున్నారు. ఆపద సమయంలో ఆదుకునే వారే ఆత్మీయ స్నేహితులని నిరూపించారు. ఈ సందర్భంగా రజనీకర్ తో ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకుని బాధపడ్డారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాకూరి శ్రీనివాస్ రెడ్డి, బూరుగు(మద్దూరు) కృష్ణ, అర్షం నవీన్ కుమార్, పరకాల మహేందర్ రెడ్డి, కారంపూరి మల్లేశం, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధక్షుడు పరకాల తిరుపతి రెడ్డి, రాంపూర్ మాజీ సర్పంచ్ అనగోని పరుశురాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదంలో గాయపడిన కార్మికునడి మృతి

ప్రతిపక్షం,నంగునూరు, ఫిబ్రవరి 28: నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన దినసరి కార్మికుడు పంగ నరసింహారెడ్డి ఇటీవల మృతి చెందాడు. నరసింహారెడ్డి రోజు పని చేస్తే గాని కుటుంబం గడవని పరిస్థితి. ఈ స్థితిలో ఈ నెల 21 వ తేదీన కూలి పనికి వెళ్లిన నర్సింహారెడ్డి ద్విచక్ర వాహనంపై నంగునూరు నుండి సిద్ధన్నపేటకు వస్తుండగా వాహనం అదుపు తప్పింది. ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న ఓమిని వాహనానికి ఢీకొట్టింది. దీంతో నరసింహారెడ్డికి కాలతో పాటు తలకు తీవ్రమైన గాయం అయ్యింది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆస్పత్రికి వెళ్లడానికి నిర్లక్ష్యం చేశారు. రెండు రోజుల అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆలస్యం కావడంతో కాలుకు తలకు తగిలిన గాయంతో బ్లడ్ ఇన్ఫెక్షన్ కావడంతో చికిత్స పొందుతూ గాంధీ హాస్పిటల్ లో మరణించినాడు. నరసింహారెడ్డి మరణించిన విషయాన్ని కార్మికుల ద్వారా తెలుసుకున్న జిల్లా ఆటో డ్రైవర్ కార్మిక విభాగం అధ్యక్షుడు, నంగునూరు మండల బీ ఆర్ ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు గోనేపల్లి సిద్దేశ్వర్ గౌడ్ శనివారం పరామర్శించారు. మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు దృష్టికి తీసుకువెళ్లి కార్మికుడు ఆయన నరసింహా రెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం అందేలా చేస్తానని హామీ ఇచ్చారు. నంగునూరు గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు ఆరే శ్రీనివాస్ గౌడ్ తల్లి ఆరే విజయ అనారోగ్యంతో మరణించడంతో శ్రీనివాస్ ను పరామర్శించారు. ఈ కార్యక్రలో మండల ఆటో కార్మిక విభాగం కమిటీ సభ్యులు ఆంజనేయులు. మండల కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి వానరాశి హనుమంతు, హమాలి సంఘం కార్యదర్శి గజ్జల మధు సూదన్ రెడ్డి, సుధాకర్, పంగ తిరుపతిరెడ్డి, పంగ మల్లారెడ్డి. పంగ రాజేందర్ రెడ్డి, పుల్లగూర్ల శ్రీనివాస్ రెడ్డి, . సంపత్, డాకూరి రాజి రెడ్డి, పంగ మహేందర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ప్రతిపక్షం,నంగునూరు, ఫిబ్రవరి 28: విద్యార్థులు ప్రతి విషయాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలిస్తే అనేక విజ్ఞాన విషయాలు వెలుగులోకి వస్తాయని నంగునూరు మండలం మగ్ధుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్ అన్నారు. శనివారం పాఠశాలలో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని(నేషనల్ సైన్స్ డే ను) నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేశారు. విజ్ఞాన పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులచే ప్రయోగాలు చేయించారు. అనంతరం వ్యాస రచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. మన చుట్టూ జరిగే సంఘటనల వెనుక ఉండే విజ్ఞానాన్ని శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన



ప్రదర్శన ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు కత్తుల లక్ష్మారెడ్డి, జీడిపల్లి సురేందర్ రెడ్డి, దుద్దెడ పరశు రాములు, భైరు సత్తయ్య, ధీకొండ గోవర్ధన్, ఆదిరాల సాయినాథ శర్మ, ముస్లి రాజయ్య, తడకంటి రాజు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పాకాల యాదమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు అమ్ముల స్వప్న తదితరులు పాల్గొన్నారు.





కాకినాడ పేలుడు ఘటన బాధాకరం చాలా దురదృష్టకరం. క్షతగాత్రుల్లో 9 మంది పరిస్థితి విషమంగా ఉంది. బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేస్తున్నాం. విచారణ పూర్తయ్యాక బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చూస్తాం. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున పరిహారం. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తాం. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటాం. ఇలాంటివి మరోసారి జరగకుండా చర్యలు తీసుకుంటాం. బాధ్యులైన వ్యక్తుల ఆస్తులు కూడా జప్తు చేస్తాం.

- నారా చంద్రబాబు నాయుడు, ఏపీ సీఎం

ప్రాంతీయం

పశువైద్యశాలల్లో వైద్యులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలి

- పశుసంవర్థక కార్యక్రమాలపై కలెక్టర్ దిశానిర్దేశం



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 28: సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారులు, పశువైద్యులతో కలిసి జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర పశుసంవర్థక శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ అమలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ మిషన్ ద్వారా మాంసం ఉత్పత్తి పెంపుతో పాటు ఉపాధి అవకాశాలు పెంచి రైతుల ఆదాయాన్ని అభివృద్ధి చేయాలని తెలిపారు. జిల్లాలో ప్రతి రైతును కలసి పశువుల వివరాలను ఎన్ డి పశువైద్యశాలల్లో వైద్యులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండి పశువులకు నాణ్యమైన వైద్యం, టీకాలు అందించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రతి పక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 28: పోషణ వాటికల నిర్వహణ ద్వారా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం పదిలంగా ఉంటుందని 6 వార్డు కౌన్సిలర్ మూర్తి సంధ్యారాణి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చేర్వాపూర్ అంగన్వాడీ కేంద్రం పోషణ వాటికగా ఎంపికైన సందర్భంగా శనివారం అంగన్వాడీ కేంద్రం ఆవరణలో పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ చిన్నారులకు పోషకాహారం అందించి ఆటపాటలు నేర్పి పాఠశాలలకు వెళ్లేలా సంసిద్ధం చేయడంతో పాటు గర్భిణులు బాలింతలకు పౌష్టికాహారం అందించినప్పుడే రక్తహీనత నివారించవచ్చునని, గర్భిణులు ఆరోగ్యంగా ఉండేలా కృషి చేసేందుకు అంగన్వాడీ సిబ్బంది ఏఎన్ఎం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో పోషకాహార లోపం నివారణకు తమ వార్డు అంగన్వాడీ కేంద్రం ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. వార్డులోని విద్య ,వైద్యం విషయంలో ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అంతకు ముందు కౌన్సిలర్ లు అంగన్వాడీ టిచర్, ఏఎన్ఎం, అశ కార్యకర్తలు కౌన్సిలర్ ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మద్దుల సత్యలక్ష్మి, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తాం..

ప్రతిపక్షం, తొగుట, ఫిబ్రవరి 28: వెంకట్రావుపేట లో విద్యాభివృద్ధి కోసం కృషి చేయడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్ పేర్కొన్నారు.. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సమస్య ఏర్పడగా కొత్త బోర్ మోటార్ ను బిగించారు.. పాఠశాలలో మౌళిక వసతుల కల్పన కోసం తమవంతు ప్రయత్నం చేయడం జరుగుతుందన్నారు.. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లచ్చోళ్ల లింగం , గ్రామ పంచాయతీ కార్యదర్శి రవీందర్ , వార్డ్ సభ్యులు MD జహంగీర్ , వడ్డే లలిత , పులిగారి శ్యామల, కత్తుల రాణి రమేష్ .ఎంగలి నరేందర్, కల్లెపు భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.. తాగునీటి సమస్య తీర్చిన సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్‌కు హెచ్ ఎం వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపారు..

ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రతిపక్షం, మిడిదొడ్డి, ఫిబ్రవరి 28 : మిరుదొడ్డి మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటర్మీడియట్ 2026 బోర్డు మార్గదర్శకాల ప్రకారం అత్యంత పారదర్శకంగా విద్యార్థులు ప్రశాంత వాతావరణం లో పరీక్ష రాసేలా విధులు నిర్వహించాలని చీఫ్ సూపరిండెంట్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఎక్కడ ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా చూసుకోవాలి. విజిటర్ రిజిస్టర్ సంతకం చేసి మిగతా పరీక్షలు సైతం సజావుగా జరపాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రంలోకి పోన్ అనుమతి లేదని పూర్తి చెక్ చేశాకే లోపలికి అనుతించాలని, సెంటర్ చుట్టు 144 సెక్షన్ అమలుతో పాటు గట్టి బందోబస్తు నిర్వహించాలని పోలిస్ అధికారులను ఆదేశించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

మీరుదొడ్డి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా సందర్శించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేస్తూ ఉదయం 10 గంటల 15 నిమిషాలు అయినను మెడికల్ ఆఫీసర్ ల్యాబ్ టెక్నిషియన్స్ పిహెచ్సికి రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీల్డ్ విసిట్ వెళ్ళిన వారు తప్పనిసరిగా ఏ గ్రామానికి వెళ్తున్నారో ఆసుపత్రిలో సమాచారం అందించాలని తెలిపారు. గైర్హాజరు ఆయన వారిపై యాక్షన్ తీసుకోవాలని డిఎంఅండ్ హెచ్ ఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు. సకాలంలో ఆసుపత్రికి విచ్చేసి మీ యొక్క విధులు సక్రమంగా నిర్వహించాలని రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని నిర్లక్ష్య వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జ్వరంతో ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాలని మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని రోగికి సూచించారు.



అతివేగమే రోడ్డు ప్రమాదాలకు కారణం

- జిల్లా అదనపు ఎస్పీ మహేందర్



ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 28 : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడిపి, తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం పరేడ్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పరేడ్‌కు హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్‌ను పరిశీలించి, అధికారులకు మరియు సిబ్బందికి విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన,శారీరక దృఢత్వం (ఫిజికల్ ఫిట్‌నెస్) ఎంతో అవసరమని సూచించారు.ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. మున్సిపాలిటీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన జిల్లా పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. "అరైవ్ అలైవ్ -2026" రెండవ విడత కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి, నిర్ణీత వేగ పరిమితుల్లో వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు.అతి వేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో యువత శాతం అధికంగా ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంచే లక్ష్యంతో ప్రతి గ్రామంలో ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సిబ్బంది ఇంటి నుండి విధులకు బయలుదేరి క్షేమంగా తిరిగి ఇంటికి చేరే వరకు వారి కుటుంబ సభ్యులు ఎదురుచూస్తారని గుర్తుచేశారు.చివరగా సిబ్బందితో కలసి ప్రతిజ్ఞను చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, ఏఆర్ డీఎస్పీ. రంగా నాయక్, సీఐలు జార్జ్, మహేష్,కృష్ణమూర్తి,ఎస్ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



భవిష్యత్తులో శాస్త్రవేత్తలు గా ఎదగడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో అవసరం

- మండల విద్యాధికారి అంజయ్య

ప్రతి పక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 28 : జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా శనివారం జడ్.పి.హెచ్.ఎస్ రామేశ్వరంపల్లి పాఠశాలలో విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుడు మాడుగుల శ్రీనివాస్ , జీవశాస్త్ర ఉపాధ్యాయులు నర్మదల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అక్బర్ పేట భూ 0 పల్లి మండల విద్యాధికారి అంజయ్య, రామేశ్వరంపల్లి సర్పంచ్ , రజిత కుమార్, చిన్న నిజాంపేట్ సర్పంచ్ మహేష్,అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ శ్యామల లు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి అంజయ్య మాట్లాడుతూ పిల్లల ప్రదర్శించిన 37 వైజ్ఞానిక ప్రదర్శనలు కొనియాడుతూ భవిష్యత్తులో చిన్నారులకు బాల శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు చాలా అవసరమని అన్నారు. అంతకుముందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గట్టిపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఈ విధంగానే పిల్లలలో దాగిన సామర్థ్యాలను వెలికితీయటానికి మరిన్ని ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూడవెల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివాజీ , నిజాంపేట్ ప్రధానోపాధ్యాయులు నరసింహ రెడ్డి ,రామేశ్వరంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామల జోహాన్ కుమార్,ఉపాధ్యాయులు నీలం శ్రీనివాస్,పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొనడం జరిగింది.



మల్లికార్జున్ గౌడ్‌పై అక్రమ కేసులు దారుణం

- కాంగ్రెస్ కక్షసాధింపు చర్యలపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 28 : మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ వరుసగా అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు.బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను రాజకీయంగా ఎదుర్కోలేక.. పోలీసులను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ నాయకులు ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల సమయం నుంచి మల్లికార్జున్ గౌడ్‌పై కాంగ్రెస్ నాయకులు కక్షకట్టారని, ఇప్పటికే ఆయనపై నాలుగు తప్పుడు కేసులు పెట్టారని ఆ కేసుల్లో ఆయనకు హైకోర్టు స్టే ఇచ్చినా ఎలాగైనా జైలుకు పంపాలన్న దురుద్దేశంతో వెంటనే మరో కొత్త అక్రమ కేసు పెట్టి పోలీసులు అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యానికి నిదర్శనం. అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న పోలీసుల తీరు మారాలని మల్లికార్జున్ గౌడ్‌ను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. అక్రమ కేసులతో ఇబ్బంది పడుతున్న ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.



మార్కండేయ దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 28 : సిద్దిపేట పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు. పట్టణ పద్మశాలి సమాజం అధ్యక్షుడు కాముని రాజేశం ఆధ్వర్యంలో ఉదయం 8.00 గంటలకు ఆవాహిత పూజ, గర్త సంస్కారము నిర్వహించగా, ఉదయం 9.25 నిమిషాలకు మేషలగ్న శుభాంశ సుముహూర్తంలో యంత్ర ప్రతిష్టా, ధ్వజప్రతిష్టా కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి కరకమలములచే యంత్ర ప్రతిష్టా, కళాన్యానం, న్యాసహవనము, ప్రాణ ప్రతిష్టా, బలిప్రదానము, పూర్ణాహుతి, అభిషేకము, అవభృథము తదితర వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. అనంతరం అన్నప్రసాద వితరణ, ఆశీర్వచనము, ఋత్విక్ సన్మానము కార్యక్రమాలు నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కెవిఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు, బి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగా రాజేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఉపాధ్యక్షులు పెద్ది అశోక్, ఇప్పకాల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి సిరిగాది బాల్ రాజు, సహాయ కార్యదర్శులు గుండు రవితేజ (లడ్డు), చిలుక ఆంజనేయులు, కోశాధికారి సూరం ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పెద్ది శ్రీనివాస్, బైరి ప్రకాష్, దీకొండ మహేష్, కొండబత్తిని రాజ్ కోటి, పేర్ల రాజేంద్రప్రసాద్, దండే సంతోష్‌కుమార్, వీరబత్తిని నగేష్, ఆడేపు నాగరాజు, గోటిపాముల జలజ, సిరిముల్ సునీత, పుట్ట సునీతలతో పాటు యువజన సంఘం, మహిళా సంఘం ప్రతినిధులు, 43 వార్డుల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం భక్తుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో విజయవంతంగా ముగిసింది.


ఇంటర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన మెదక్ ఆర్డీవో

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 28 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించే క్రమంలో శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మెదక్ లో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పరీక్షా హాళ్లలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరును, పరీక్షల నిర్వహణ విధానాన్ని నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోనే ప్రశ్నాపత్రాలను తెరిచారా లేదా అన్నది పరిశీలించారు. సీసీటీవీ నిఘా మధ్య ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు.పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, మెడికల్ కిట్ తో ఏఎన్ఎం అందుబాటులో ఉండటం, టాయిలెట్ వసతులు వంటి మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పరీక్షలు పూర్తైన వెంటనే ఆన్సర్ షీట్లను తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు సురక్షితంగా తరలించాలని సూచించారు. ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకతతో, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని ఆర్ డి ఓ స్పష్టం చేశారు.

మెదక్‌ను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలి : వివేక్



ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 28 : మెదక్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలనీ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంత్రి వివేక్ వెంకటస్వామి నీ సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో పుష్ప గుచ్చం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ..మెదక్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలనీ, ప్రజాప్రభుత్వానికి మరింత మంచి పేరు తేవాలన్నారు.జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..తన శక్తి వంచనతో అహర్నిశలు పనిచేసి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెస్తామన్నారు





భారత్ ఇప్పుడు 'హార్డ్‌వేర్' రంగంలో కూడా తన ఉనికిని చాటుకుంటూ శక్తిమంతంగా మారుతోంది. ఈరోజు సానంద్‌లో సరికొత్త భవిష్యత్తు ఆవిర్భవించడాన్ని మనం చూస్తున్నాం. మైక్రాన్ సంస్థకు చెందిన ఈ ఏటీఎంపీ ఫెసిలిటీలో వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభం కావడం అనేది గ్లోబల్ టెక్నాలజీ వాల్యూ చైన్‌లో భారతదేశ పాత్రను మరింత బలోపేతం చేయనుంది. నేడు భారత్ అత్యంత వేగంగా 'గ్లోబల్ సెమీకండక్టర్ వాల్యూ చైన్'లో అంతర్భాగమవుతోంది.

- భారత ప్రధాని నరేంద్ర మోడీ

ప్రాంతీయం

యాజమాన్యులకు భరోసా కల్పించాలి

జిల్లా కలెక్టర్ కె. హైమావతి



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 28: భూ రికార్డుల పై రైతులకు, యాజమాన్యులకు భరోసా కల్పించేలా లైసెన్స్ సర్వేయర్ లు పని చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు.సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో శిక్షణ పూర్తి చేసుకున్న 110 మంది సర్వేయర్లకు ధృవీకరణ లైసెన్స్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ పేద ప్రజల కష్టాలను తొలగించేందుకు రైతులకు చుట్టంగా ఉండే విధంగా అద్భుతమైన భూ భారతి చట్టం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు.రెండవ విడతలో సర్వేయర్ అభ్యర్థులకు శిక్షణ అందించి పరీక్షలు ఆధారంగా ఉత్తీర్ణత సాధించి జిల్లాలో అర్హత సంపాదించిన 110 మంది అభ్యర్థులకు లైసెన్సులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. లైసెన్స్ సర్వేయర్ లను మండలాల వారీగా అందుబాటులో ఉన్న భూమి ఆధారంగా అలాట్మెంట్ చేస్తామని అన్నారు.భూములు ఉన్నరైతులకు భరోసా కల్పించే భూ భారతి చట్టం అమలు కోసం సర్వేయర్ లకు ఆధునిక సాంకేతిక వినియోగించేందుకు సామాగ్రి ప్రభుత్వం పంపిణీ చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ సుదర్శన్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసుతో అనగదొక్కాలని ప్రయత్నించిన

వారికి కనువిప్పు కలగాలి

జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల



ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 28 : అక్రమ కేసుతో అనగదొక్కాలని ప్రయత్నించినప్పటికీ చివరకు న్యాయమే గెలిచిందని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ అన్నారు. లిక్కర్ కుంభకోణం నుండి నిర్దోషిగా బయట పడిన జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితను శనివారం యాదగిరి ముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలిసి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై ప్రజలను చైతన్యం చేయడంతో పాటు, అహంకార ధోరణితో వెళ్తున్న బిఆర్ఎస్ పార్టీ, అక్రమంగా సిబిఐచే కేసు నమోదు చేయించిన కేంద్రంలోని బిజెపి సర్కార్ కు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. అంతేకాకుండా రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి బలోపేతం కావాలని, బీసీలకు వివిధ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ సాధన లక్ష్యంగా జాగృతి శ్రేణులు కృత నిశ్చయంతో పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు.





నిప్పులాంటి మనిషి కవిత

- తెలంగాణ జాగృతి నాయకులు శ్రీనివాస్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 28 : ఢిల్లీ లిక్కర్ కేసులో కల్వకుంట్ల కవితకు ఉపశమనం లభించడంతో సిద్దిపేటలో తెలంగాణ జాగృతి నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. జాగృతి జిల్లా నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న కవిత ఎలాంటి నేరం చేయలేదని, కేసుకు సంబంధించి సరైన ఆధారాలు సమర్పించలేదని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు వ్యాఖ్యానించినట్లు పేర్కొన్నారు. కేసులో భాగంగా సౌత్ గ్రూప్ సంస్థలో కవిత పాత్ర ఉందని ఆరోపిస్తూ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) తప్పుడు కేసులు నమోదు చేసి ఆమెను తీహార్ జైలుకు పంపిందని వారు విమర్శించారు.రాజకీయ కక్షతో మహిళా నాయకురాలిని అన్యాయంగా కేసులో ఇరికించారని జాగృతి నేతలు ఆరోపించారు. కవిత ప్రారంభం నుంచే తాను నిర్దోషినని, న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. చివరకు న్యాయం గెలిచిందని పేర్కొన్నారు.ఈ తీర్పు రాజకీయ ప్రత్యర్థులకు చెంపపెట్టు లాంటిదని, మహిళల పై తప్పుడు కేసులు పెట్టడం దేశ ప్రతిష్టకు మంచిది కాదని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా మేధావులు కూడా ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు

- మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు



ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 28 : డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలు ఏర్పడి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. తూప్రాన్ టోల్గేట్ వద్ద అలైవ్ అరైవ్ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. రోడ్డు ప్రమాద బాధితులకు కేంద్ర ప్రభుత్వం 25 వేల రూపాయలు అందిస్తుందని పేర్కొన్నారు. వయసు పైబడిన డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బస్సు లారీ ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని శ్రీనివాసరావు అన్నారు. వాహనాలను అతివేగంగా తోలడం మద్యం సేవించడం కారణంగానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే అతి ప్రమాదకరంగా ఉన్న బాధితులను ఆసుపత్రికి తరలిస్తే ఎక్కువ శాతం బతికే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనదారులు పోలీసులకు సమాచారం అందించాలని మానవత్వంతో వారికి చేదోడుగా నిలవాలని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు తర సామాగ్రిని శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. వాహనాలను ఓవర్టేక్ చేయడం రాంగ్ రూట్లో వెళ్లడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ఐసిలు రంగ కృష్ణ జాన్ రెడ్డి సందీప్ రెడ్డి జీఎంఆర్ అధికారులు సీఎంఆర్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మూఢనమ్మకాలతో సమాజానికి చేటు

- నంగునూరు ఎంఈవో దేశి రెడ్డి

ప్రతిపక్షం, నంగునూరు, ఫిబ్రవరి 28 : మూఢ నమ్మకాలు సమాజానికి చేటు కలిగిస్తాయని, వాటిని నిర్మూలించేందుకు విద్యార్థులు కృషి చేయాలని నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశి రెడ్డి సూచించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ అంశాల్లో విద్యార్థులు ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. సేంద్రియ వ్యవసాయం, భూకంప అలారం, పంటల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ తదితర 36 ప్రదర్శించి వివిధ అంశాల్లో విద్యార్థులు బహుమతులు గెలుపొందారు. పాఠశాలలో నమూనా వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు డాక్టర్లు(కార్డియాలజిస్ట్ , గైనకాలజిస్ట్, డెర్మటాలజీస్ట)గా వ్యవహరించి వివిధ (రక్త పరీక్షలు) నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సిద్దిపేట వైద్యురాలు రాచకొండ సాయిశ్రీ సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఆడపిల్లల్లో వచ్చే జబ్బులు పరిశుభ్రత ప్రాధాన్యత పై మార్గదర్శనం చేశారు. నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ప్రజా చైతన్యకార్యక్రమాలు నిర్వహిస్తున్న బి. ప్రశాంత్ నిత్యజీవితంలో సైన్స్ ప్రాధాన్యత అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తగిరెడ్డి దేశి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషిస్తూ సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు పాటుపడాలని కోరారు సైన్స్ మానవ జీవితాన్ని సుఖమయం చేస్తుందని తెలిపారు. శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండే అందిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్నారి తొమ్మిదవ తరగతి విద్యార్థిని గోడెపు కారుణ్య సీ వీ రామన్ వేశధారణలో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, సైన్స్ ఉపాధ్యాయులు గణపతి, కనకయ్య. మన్మోహన్ రెడ్డి, త్రివిక్రమ్ శర్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం



ప్రతిపక్షం,తొగుట, ఫిబ్రవరి 28 : తొగుట మండలంలోని జెప్తి లింగారెడ్డిపల్లె గ్రామంలో యెన్నం నాగవ్వ కిష్టారెడ్డి నూతన ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని నాగవ్వ కిష్టారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మిఠాయిలు పంచుకున్నారు అనంతరం మాట్లాడుతూ నాడు నేడు పేదవాడికి ఇళ్లు అందించడమే మా ప్రజా పాలన లక్ష్యం అని విడతలవారీగా నియోజకవర్గంలో ఇల్లు లేని పేదవాడు లేకుండా చూడటమే నా కర్తవ్యం అని అన్నారు తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, AMC మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్),మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి,సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య, గౌరవ సర్పంచ్లు కనకయ్య, పాగల శోభా కొండల్ రెడ్డి,గొడుగు జయమ్మ నర్సింలు,ఆత్మ కమిటీ డైరెక్టర్లు ప్రవీణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బిక్షపతి,చందా సత్తయ్య,గ్రామ పార్టీ అధ్యక్షులు కొండల్ రెడ్డి, సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి,నిరంజన్ రెడ్డి,పంది రాజు, బండారు రమేష్ గౌడ్,మహ్మద్ షఫీ,స్వామి గౌడ్,చందా రవి,బాలరాజు,తిరుమలా ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.




పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 28:
పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి,జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్ సూచించారు. శనివారం జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్ సిద్దిపేట జిల్లా కోర్టుకు రాగ జిల్లా జడ్జ్ సాయి రమాదేవి,ఇతర న్యాయమూర్తులు స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించి కోర్టు హాల్లో ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ లో పాల్గొని జిల్లాలో వివిధ కేసుల డిస్పోజల్ పెండింగ్ కేసుల పై న్యాయమూర్తులు,న్యాయ సిబ్బందిచే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయశాఖ పనిచేస్తుందని జిల్లాలో వివిధ కేసులలో వచ్చే కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. అదేవిధంగా పెండింగ్ కేసులు లేకుండా ఎప్పటికప్పుడు డిస్పోజట్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి కే. సాయి రమాదేవి, అదనపు జిల్లా జడ్జి వై.జయప్రసాద్, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి సంతోష్ కుమార్ మరియు మిగతా జిల్లా న్యాయమూర్తులు, ఏవో సుల్తాన్ ఆసిఫ్ ఇక్బాల్, వై.రవీందర్, మిగతా సిబ్బంది పోలీస్ అధికారులు, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు సిహెచ్ జనార్దన్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ తాటికొండ రమేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు మెదక్ పట్టణంలో నీటి సరఫరా బంద్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 28 : సింగూరు వద్ద హెడ్ వర్క్ మెయింటనెన్స్ లో భాగంగా పట్టణమునకు మంచినీరు సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కావున నేడు తేదీ 01.03.2026 ఆదివారం రోజున పట్టణములో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆయన తెలిపారు

సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసుల మెరుపు దాడి

- అక్రమంగా తరలిస్తున్న 26 పశువుల స్వాధీనం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 28: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని టాస్క్ ఫోర్స్ బృందం శనివారం తెల్లవారుజామున అక్రమ పశువుల రవాణాపై ఉక్కుపాదం మోపింది. నమ్మదగిన సమాచారం మేరకు చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇబ్రహీంనగర్ గ్రామ శివార్లలో చిన్నకోడూర్ పోలీస్ వారితో తనిఖీలు నిర్వహించి, అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ నుండి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు రెండు మహీంద్రా పికప్ వాహనాల్లో పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులకు ముందస్తు సమాచారం అందగా.ఆ మేరకు ఇబ్రహీంనగర్ శివార్లలో నిఘా ఉంచిన పోలీసులు, రెండు వాహనాలను అడ్డగించి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మొత్తం 26 పశువులను (13 ఆవులు, 13 ఎడ్లు) గుర్తించారు. చిన్నకోడూర్ పోలీసులు ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు.ఈ అక్రమ రవాణాకు ప్రధాన సూత్రధారి హైదరాబాద్‌కు చెందిన మొహమ్మద్ ఫయాజ్ అని ప్రాథమిక విచారణలో తేలింది.పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న పశువులను, వాహనాలపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ చంద్రమోహన్ తెలియజేశారు.చట్టవిరుద్ధంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రమోహన్ హెచ్చరించారు.



పదేండ్ల బాలికకు అరుదైన వ్యాధి

- బోన్ మ్యారో ఎప్లాస్టిక్ అనీమియాతో బాధపడుతున్న శ్రీనిధి
- చికిత్సకు ఇప్పటి వరకు రూ.8 లక్షల వరకు ఖర్చు
- ఇంకా రూ.20లక్షలు ఖర్చవుతుందన్న డాక్టర్లు
- మనసున్న మహారాజులు ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 28 : అక్బర్ పేటభూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబం ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది. గ్రామానికి చెందిన బిట్ల పర్శరాములుగీతా దంపతుల కూతురు శ్రీనిధి (10) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. చలాకీగా ఉండే శ్రీనిధి గత ఐదు నెలలుగా బోన్ మ్యారో ఎప్లాస్టిక్ అనీమియా అనే అరుదైన వ్యాధితో బాధపడుతోంది. డాక్టర్ల సూచన మేరకు తల్లిదండ్రులు హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. చికిత్సకు అవసరమైన ఏటీజీ ఇంజక్షన్ ఇచ్చినప్పటికీ 4నెలలుగా ఎలాంటి ఇంప్రూవ్ మెంట్ కనిపించలేదు. చికిత్స కోసం ఇప్పటి వరకు రూ. 7నుంచి 8లక్షలు ఖర్చు అయ్యాయి. స్తోమతకు మించి ఖర్చులు కావడంతో పర్శరాములు తనకున్న 18గుంటల భూమి కూడా అమ్మాడు. కాగా డాక్టర్లు తప్పనిసరిగా బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ చేయాలని సూచించారు. బాలిక వెన్నుపూస గుజ్జు అభివృద్ధి చెందకు పోవడంతో బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ చికిత్సకు సంబంధించి డోనర్ కోసం కండ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. చికిత్సకు దాదాపు రూ.20లక్షల వరకు ఖర్చవుతుందని మనసున్న మహారాజులు ముందుకొచ్చి ఆర్థికసాయం అందించాలని వేడుకుంటున్నారు. తమ కూతురు ప్రాణాలు కాపాడాలని దీనంగా అభ్యర్థిస్తున్నారు. 9652210740 నెంబర్ కు ఫోన్ పే, గూగుల్ పే చేయాలని కోరారు. ఇదిలా ఉండగా బాలిక అనారోగ్య విషయం తెలుసుకున్న సిద్దిపేటకు చెందిన హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు తమవంతుగా రూ.10వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులు సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రామంతపూర్‌లో టాస్క్ ఫోర్స్ అధికారుల దాడి

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 28: చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని రామంతాపూర్ అటవీ ప్రాంతంలో పేకాట రాయులను టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు జరిపి పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ వెల్లడించారు. ఇందులో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి 24 వేల నగదు 9 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో నేరెళ్ల రాజు మల్లా ప్రభాకర్ ఏనుగందుల నర్సింలు సాయగౌడ్ కాబోజు ప్రవీణ్ వనం రాజు ఉప్పల నరేష్ గా గుర్తించారు. చిట్టోజిపల్లి స్వామి పోతులగూడ నరేష్ స్వామి వల్లూరు రాజు ఫరారి లో ఉన్నట్లు తెలిపారు.





ఇరాన్‌పై ఒకవేళ సైనిక దాడులు సుదీర్ఘ యుద్ధానికి దారితీసే అవకాశం లేదు. ఇరాన్ అణు దేశంగా మారకుండా అడ్డుకోవడానికి ట్రంప్ ప్రభుత్వం సైనిక, దౌత్యపరమైన వ్యూహాలను పరిశీలిస్తోంది. గతంలో ఇరాక్ యుద్ధం వంటి తప్పులు మళ్లీ జరగవు. ప్రస్తుతానికి చర్చల ద్వారానే పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తున్నామన్నాం. చెత్త పాలకుల చేతుల్లో అణ్వాయుధాలు ఉండటం ప్రపంచానికే ప్రమాదం. పరిస్థితి చేయి దాటితే ఏ చర్యకైనా వెనుకాడబోం.

- అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తనిఖీలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 28 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని శనివారం ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సందర్శించారు. అంతకుముందు మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్), క్రిటికల్ కేర్ యూనిట్ లతో కూడిన భవన సముదాయాన్ని పరిశీలించారు. సుదీర్ఘ కాలం నుంచి పలు పనులు పెండింగ్ లోనే ఉండడం గమనించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఒకింత అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జీ.జీ.హెచ్ లో కొనసాగుతున్న ప్రసూతి సేవల విభాగాన్ని వెంటనే ఎం.సీ.హెచ్ లోకి మార్చాలని ఆదేశించారు. అనంతరం జీజీహెచ్ లో ఆసుపత్రి పనితీరుపై సంబంధిత వైద్యులతో ప్రభుత్వ సలహాదారు, కలెక్టర్ ఇలా త్రిపాఠి సమీక్ష జరిపారు. ఒక్కో విభాగం వారీగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న డాక్టర్లు, సిబ్బంది ఖాళీలు, కొత్తగా అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలు, ఇంకనూ సమకూర్చాల్సి ఉన్న సదుపాయాలు తదితర వాటి గురించి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి వైద్య విభాగాల అధిపతులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలను మరింతగా మెరుగుపర్చాలని, అవసరమైన అన్ని వసతులు సమకూరుస్తామని సూచించారు. వివిధ వైద్య సేవల కోసం ప్రతిరోజు 2000 మంది వరకు అవుట్ పేషంట్ రోగులు జీజీహెచ్ కు వస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని అన్ని విభాగాల పనితీరు మెరుగుపడేలా చూడాలన్నారు. అన్ని విభాగాలలో 180 మంది వైద్యులు, సరిపడా సిబ్బందితో పాటు అధునాతన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు జీజీహెచ్ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మేజర్, మైనర్ సర్జరీలతో పాటు షుగర్, బీపీ, డెంగ్యూ, మలేరియా, థైరాయిడ్ వంటి వ్యాధి నిర్ధారణ టెస్టులు ఉచితంగా చేస్తారని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వీటికి వేల రూపాయల రుసుము వసూలు చేస్తారని అన్నారు. అన్ని విభాగాలలో ప్రైవేట్ తో పోలిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నిపుణులైన వైద్యులు, వారికి అనుబంధంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న మెడికోలు ఉన్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా జీజీహెచ్ లో కీలు మార్పిడి శాస్త్ర చికిత్సలు నిర్వహిస్తుండడం జరుగుతోందని, డెంటల్ విభాగం ఆధ్వర్యంలో ఎంతో ఖర్చుతో కూడుకుని ఉన్న సర్జరీలను కూడా స్థానికంగా చేస్తున్నారని అన్నారు. విద్యా, వైద్య రంగాల పని తీరును మరింతగా మెరుగుపర్చాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆసుపత్రికి అవసరమైన ఆధునాతన వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరు చేయిస్తున్నామని గుర్తు చేశారు. కొంతమంది సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రత్యేకించి బయో మెట్రిక్ హాజరు వేసుకుని వెళ్ళిపోతున్న సిబ్బందిపై గట్టి నిఘా ఉంచాలన్నారు. సమీక్షలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాములు, వివిధ విభాగాల వైద్యాధికారులు పాల్గొన్నారు.





విజయవంతంగా ముగిసిన ప్రమాణ2026

- అలరించిన సాంకేతిక, సాంస్కృతికోత్సవాలు
- విద్యార్థులలో మిన్నంటిన కోలాహలం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 28 : హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో, ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన వార్షిక సాంకేతికసాంస్కృతికోత్సవాలు (ప్రమాణ2026) శనివారం నిర్వహించిన ఈడీఎండీజే నైట్ తో విజయవంతంగా ముగిశాయి. ఈ రెండు రోజుల వేడుకకు విద్యార్థులు, ఇతరుల నుంచి అద్భుతమైన స్పందన కనిపించింది. గీతం హైదరాబాదు ప్రాంగణాన్ని సాంకేతిక, సృజనాత్మక, సాంస్కృతిక వ్యక్తీకరణ యొక్క శక్తివంతమైన సంగమంగా మార్చింది. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రసిద్ధ చలనచిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను ప్రమాణ2026ను లాంఛనంగా ప్రారంభించి, విద్యార్థులను ఉన్నతాశయాల వైపు ప్రేరేపించేలా స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. ప్రసిద్ధ భారతీయ సినిమా దర్శకుడు, స్క్రీన్ రైటర్ హరీష్ శంకర్ కూడా విద్యార్థులను తమ కలలను ఆసక్తి, ధైర్యంతో అనుసరించాలని ప్రేరేపిస్తూ ఉత్సాహభరిత, ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. గ్రాండ్ ఆటో ఎక్స్ పోతో ఆరంభమైన ప్రమాణ 2026, విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసేలా పలు కార్యక్రమాలకు నెలవుగా మారింది. సాంస్కృతిక సాయంత్రాలలో ది డెక్కన్ ప్రాజెక్ట్, హెడ్ లైనర్ బ్యాండ్ ప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ప్రఖ్యాత నేపథ్య గాయని గీతా మాధుని తన శ్రావ్యమైన గాత్రవిన్యాసంతో అందరినీ మంత్రముగ్ధులను చేశారు. తరువాత హైఎనర్జీ డీజే యువతతో చిందులేయించింది. ఇక ముగింపు వేడుక మరింత శోభాయమానంగా మారి విద్యార్థుల కేరింతలతో మార్మోగిపోయింది. కాశ్యప్ - ది మ్యూజికల్ సెన్సేషన్, డీజే స్వాటెక్స్ ల అద్భుతమైన ప్రదర్శనతో గ్రాండ్ ఫినాలే ఉత్సాహాన్ని రెట్టింపు చేసి, మరపురాని ఈడీఎం అనుభూతిని అందించింది. నృత్యం, సంగీతం, స్కిట్లు, సాంస్కృతిక యుద్ధాలతో ఉన్నత స్థాయి పోటీలు విద్యార్థులకు వారి ప్రతిభ, సృజనాత్మకతను ప్రదర్శించడానికి అసాధారణమైన వేదికను అందించింది. హైదరాబాదు చుట్టుపక్కల కళాశాలల నుంచి విద్యార్థులను ప్రమాణ2026 ఆకర్షించి, వారిలో ఆరోగ్యకరమైన పోటీ, సహకార స్ఫూర్తిని పెంపొందించింది. గీతం హైదరాబాద్ నాయకత్వం ఖచ్చితమైన ప్రణాళిక, తిరుగులేని మద్దతు ఈ కార్యక్రమాన్ని సజావుగా అమలు చేయడానికి దోహదపడింది. ప్రమాణ2026తో, గీతం మరోసారి ఆవిష్కరణ, ప్రతిభ, సమగ్రాభివృద్ధిని పెంపొందించడానికి తన నిబద్ధతను పునరుద్ఘాటించడమే గాక, సృజనాత్మకత, శ్రేష్ఠతకు కేంద్రంగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.

ఆత్మవిశ్వాసంతో చదివితే విజయం మీ సొంతం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 28 : ఆత్మవిశ్వాసంతో చదివితే విజయం మన సొంతం అవుతుందని, పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికబద్ధంగా చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని 10వ తరగతి విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో తన సొంత నిధులతో పదోతరగతి విద్యార్థుల కోసం తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ ప్రేరణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులతో మోటివేషనల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి జీవితంలో పదవ తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, ఇలాంటి సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు.. ప్రణాళిక బద్ధంగా చదివేందుకు ఈ తరగతులు ఎంతగానో ఉపకరిస్తున్నాయని తెలిపారు. చదువు అంటే కేవలం ర్యాంకులు ఒక్కటే కాదని.. ప్రతి విద్యార్థి చదువుతోపాటు నైతిక విలువలు, మానసిక సామర్థ్యం, శారీరక ధారుడ్యం పెంపొందించుకోవాలని కోరారు. విద్యార్థులను ప్రోత్సహించడం కోసం ప్రతి సంవత్సరం మండల స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సొంత నిధులతో నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నామని తెలిపారు. విభిన్న సంస్కృతులకు నిలయమైన పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య భారం కాకూడదన్న సమున్నత లక్ష్యంతో.. పటాన్చెరులో కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థలు నెలకొల్పడం జరిగిందని గుర్తు చేశారు. ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గంలో పారిశ్రామిక రంగానికి అవసరమైన ఉద్యోగులను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వంతో చర్చించి పాలిటెక్నిక్ కళాశాల సైతం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆధునిక వసతులతో అత్యాధునిక ల్యాబ్ సైతం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారులు రాములు, సుధాకర్, మండల విద్యాధికారి పీపీ రాథోడ్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు మధు, సీనియర్ నాయకులు రామచంద్రా రెడ్డి, నర్రా బిక్షపతి. ఐలేష్ యాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.



కాజీపేట ఉద్యోగాల కోసం పోరాడుతాం

- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 28 : హనుమకొండ జిల్లా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మహా ధర్నా స్థానిక యువతకు ఉద్యోగాల సాధన మా ఉద్యోగాలు మాకే కావాలి అనే బలమైన నినాదంతోనే నాడు కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. కేవలం రాష్ట్రాన్ని సాధించడమే కాదు, తెలంగాణ యువతకు 95 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించారని ప్రభుత్వ ఉద్యోగాల్లో ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే 95 శాతం స్థానికత దక్కేలా రాష్ట్రపతి ఉత్తర్వులు తీసుకొచ్చిన ఘనత కూడా కేసీఆర్ గారిదే అని తెలంగాణ రాష్ట్రం రావడం వల్లే కాజీపేటకు ఈ కోచ్ ఫ్యాక్టరీ వచ్చింది అని ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని, ఇక్కడ పరిశ ఫ్యాక్టరీ వచ్చినా స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేస్తోంది నాడు కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం.. దేవాదాయ శాఖకు చెందిన 150 ఎకరాల భూములను హైకోర్టు నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకొని మరీ కోచ్ ఫ్యాక్టరీ కోసం ఇచ్చింది కేవలం భూములు ఇవ్వడమే కాదు కోచ్ ఫ్యాక్టరీ సాధన కోసం నాడు బీఆర్ఎస్ ఎంపీలు రైల్వే మంత్రిని కలిసి, పార్లమెంట్ లో బీజేపీ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశారు అని మాజీమంత్రి హరీష్ రావు అన్నారు దేశంలో కోచ్ ఫ్యాక్టరీల అవసరమే లేదని మనకు సమాధానం చెప్పిన బీజేపీ ప్రభుత్వం.. ఆ తర్వాత అస్సాం, లాతూర్ మహారాష్ట్రలలో కోచ్ ఫ్యాక్టరీలు మంజూరు చేసి తెలంగాణకు మాత్రం మొండిచేయి చూపింది కోచ్ ఫ్యాక్టరీ అడిగితే వ్యాగన్ ఫ్యాక్టరీ హరీష్ రావు పెడతామన్నారు. అసలు ఇప్పుడు ఇక్కడ కడుతున్నది వ్యాగన్ ఫ్యాక్టరీనా? లేక కోచ్ ఫ్యాక్టరీనా? అన్న దానిపై ఇప్పటివరకు కనీసం గెజిట్ నోటిఫికేషన్ కూడా రాలేదు. అని వెంటనే దీనిపై స్పష్టతనిస్తూ నోటిఫికేషన్ విడుదల చేయాలి అని ఆయన కోరారు మహారాష్ట్రలోని లాతూర్ వ్యాగన్ ఫ్యాక్టరీలో 70 శాతం స్థానికులకే రిజర్వేషన్ ఇచ్చామని హరీష్ రావు చెప్పారు మరి తెలంగాణలో మన కాజీపేట యువతీ యువకులకు ఎందుకు ఆ రిజర్వేషన్ కల్పించడం లేదు..మహారాష్ట్రకు ఒక చట్టం, తెలంగాణకు ఒక చట్టం ఉంటుందా రాష్ట్ర ప్రజలు బీజేపీకి 8 మంది, కాంగ్రెస్ కు 8 మంది ఎంపీలను గెలిపిస్తే వాళ్లు తెలంగాణకు చేస్తున్న నిర్వాకం ఇదేనా ఇక్కడ కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎంపీ స్థానికుల ఉద్యోగాల గురించి ఎందుకు మౌనంగా ఉంటున్నారుఅని హరీష్ రావు అన్నారుకేంద్ర మంత్రులు వచ్చి ఇక్కడ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చేస్తామని భూములు ఇచ్చిన నిర్వాసితులకు, స్థానికులకు లాతూర్ తరహాలో 70 శాతం రిజర్వేషన్ కల్పించకుండా ప్రారంభోత్సవానికి వస్తే.. బిడ్డా మిమ్మల్ని ఎక్కడికక్కడ అడ్డుకుంటాం. అని మాజీ మంత్రి హరీష్ రావు చెప్పారు బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా నిలదీస్తాం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని చెప్పి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి మోసం చేశారు. ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటివరకు 200 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు.నాడు కేసీఆర్ గారు ఆటో డ్రైవర్లకు క్వార్టర్లీ టాక్స్ రద్దు చేశారు. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కళ్లు తెరిచి, ఆటో డ్రైవర్ల డిమాండ్లను నెరవేర్చాలని, వారికి ఆర్థిక సహాయం చేయాలని బీఆర్ఎస్ పక్షాన హరీష్ రావు డిమాండ్ చేస్తున్నాం. ఒకప్పుడు దేశంలోనే ప్రసిద్ధిగాంచిన కాజీపేట జంక్షన్ ప్రాధాన్యత రోజురోజుకూ తగ్గిపోతోంది. ఆంధ్రప్రదేశ్ లో విశాఖపట్నంకు రైల్వే జోన్ ఇచ్చినట్లుగానే, కాజీపేటను కూడా తక్షణమే రైల్వే జోన్ గా ప్రకటించాలి బడే భాయ్.. ఛోటే భాయ్ అంటూ మాట్లాడే రేవంత్ రెడ్డి.. కాజీపేట జంక్షన్ ను రైల్వే జోన్ గా ఎందుకు ప్రకటించడం ప లేదనో ఆయన కోరారు. తాను చేసిన అవినీతిని కేంద్రం బయటపెడుతుందని భయంతోనే రేవంత్ రెడ్డి మౌనంగా ఉంటున్నారా అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు ఈ మహా ధర్నా కార్యక్రమంలో మాజీ చీఫ్ వీప్ దాస్యం భాస్కర్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే ఆరు రమేష్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నాగుర్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



రాహుల్ గాంధీ నాయకత్వం దేశానికి అవసరం

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 28 : సోనియా గాంధీ, ప్రధాని మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ నాయకత్వంలో పదేళ్ల యుపిఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఈ దేశం లో ని గ్రామీణ, పట్టణ పేదలకు ఉపాధి కల్పించి వారిని ఆర్థికంగా నిలబెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ దని టి పి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టాన్ని తెచ్చి దేశ ప్రజలకు ప్రతీ ప్రభుత్వ వ్యవస్థ జవాబుదారీ గా ఉండేలా, ప్రతీ సమాచారాన్ని ప్రజల ముందు ఉంచిన పార్టీ కాంగ్రెస్ పార్టీ, రాజకీయంగా ఆంధ్ర ప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా నష్టపోతుందని తెలిసినా, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి తెలంగాణ ప్రజల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన చరిత్ర సోనియా గాంధీ, రాహుల్ గాంధీలది జగ్గారెడ్డి పత్రిక ప్రకటనలో తెలిపారు. నాగార్జునసాగర్ డ్యాం నిర్మాణం తో పాటు ఇక్రిశాట్, బిహెచ్ఈఎల్, ఆర్డినెన్సు ఫ్యాక్టరీ (ఏద్దు మైలారం), పఠాన్ చేరు పారిశ్రామిక వాడలోని బిడిఎల్, ఐడిపిఎల్ లాంటి ఎన్నో కేంద్ర ప్రభుత్వ సంస్థలను తెలంగాణ ప్రాంతం లో ఏర్పాటు చేసిన చరిత్ర రాహుల్ గాంధీ ముత్తాత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, నాయనమ్మ ప్రధాని ఇందిరా గాంధీ లదని అన్నారు. ఈ దేశం లోని యువతి యువకులకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి, వారి ఎదుగుదలకు అవకాశం కల్పించింది ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ మాత్రమే. ఈ దేశం లో ని యువతి యువకుల ఉద్యోగాల కల్పన కోసం ఐటి రంగాన్ని ప్రవేశ పెట్టి ఐటి రంగాన్ని అభివృద్ధి చే యడమే కాకుండా ఈనాడు మనం ఉపయోగిస్తున్న సెల్ ఫోన్ ల కు బీజం అనాడు రాహుల్ గాంధీ నాన్న , మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ తెచ్చిన టెలికాం విప్లవమే కారణం. ఈరోజు ఫలితాలు అనుభవిస్తున్న ఈనాటి యువతి యువకులు ఈ విషయాన్ని గ్రహించాలి. అందుకే ఈ దేశం ఉద్యోగ,జగ్గారెడ్డి అన్నారు. వ్యవసాయపరంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే రాహుల్ గాంధీ ఈ దేశానికి ప్రధాని కావాలి. ఈ దేశ ప్రజలు రాహుల్ గాంధీ ని ప్రధానిని చేయాలని టి పి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు.

అమ్మాయి కిడ్నాప్ కలకలం



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 28 : సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలో కిడ్నాప్ కలకలం రేపింది. ఇరవై సంవత్సరాల వయస్సు గలా అమ్మాయిని సమీప బంధువులు కిడ్నాప్ కలకలం రేపింది. పోలీస్ కామాండ్ కంట్రోల్ ఆదేశానుసారం రంగంలోకి దిగిన పోలీసులు రెండుగంటల్లో నిందితులను చేజ్ చేసి కారు తో సహా కిడ్నాప్ కు పాల్పడిన వారిని పట్టుకున్న వట్పల్లి ఎస్సై లవ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కిడ్నాప్ కు గురై ఘటన స్థలంలో ఉన్న అమ్మాయి సురక్షితం గా ఉందని అన్నారు. కిడ్నాపర్స్, శ్రీకాంత్, జగదీశ్వర్, లక్ష్మణ్ కలిసి అమ్మాయి ని కిడ్నాప్ చేసి పుల్కల్ మండలంలో రహస్యంగా ఉంచారంటూ తల్లిదండ్రులు 100 కి కాల్ చేశారు. సమాచారం అందుకున్న పుల్కల్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని, వట్టిపల్లి పోలీసులకు అప్పగించారు. రూప తల్లిదండ్రులు లక్ష్మయ్య, జయమ్మ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వట్పల్లి ఎస్సై తెలిపారు.

కాలేజ్ భవనం నుంచి దూకి ఉద్యోగి ఆత్మహత్య

ప్రతిపక్షం, బాన్సువాడ : కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం ఎస్ ఆర్ ఎన్ కె డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్గా పనిచేస్తున్న షేక్ హైమద్ శనివారం కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణం అని భావిస్తున్నారు. మరొకవైపు ప్రమాదవశాత్తు జారిపడ్డ అన్న కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కళాశాల భవనం పై అంతస్తు నుండి కింద పడడంతో తీవ్ర గాయాలపాలై, ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు సమాచారం. షేక్ హైమద్ బాన్సువాడ వ్యక్తిగా గుర్తించారు.. ప్రమాదవశాత్తూ జరిగిందా లేదా ఇతర కారణాలున్నాయా అన్న విషయంపై స్పష్టత లేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.



సంగారెడ్డి జిల్లాలో పోలీసు యాక్ట్ అమలు

ప్రతిపక్షం, సంగారెడ్డి, ఫిబ్రవరి 28 : శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మార్చి 1వ తేదీ నుండి 31 వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేపట్టకూడదని హెచ్చరించారు. ఇట్టి విషయంలో జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసు వారికి సహకరించవలసిందిగా ఎస్పీ సూచించారు.అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

లండన్ లో నిజామాబాద్ విద్యార్థి మృతి

అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 28 : నిజామాబాద్ కు చెందిన ఓ విద్యార్థి ఉన్నత విద్య కోసం లండన్ వెళ్లి మృత్యువాత పడ్డాడు. జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన కామినేని సాయిశ్రీకర్ (26) లండన్ లో ఎంఎస్ చదవడానికి వెళ్లాడు. అక్కడ చదువు పూర్తి అయ్యాక లండన్‌లోని క్రాయ్డన్ ప్రాంతంలో అద్దె ఇంటిలో ఉంటూ ఉద్యోగంలో చేరాడు. ఈ క్రమంలో శ్రీకర్ ఉంటున్న నివాసంలో గత మంగళవారం రాత్రి (ఫిబ్రవరి 24న) భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీకర్ మూడు రోజుల పాటు చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశాడు. శ్రీకర్ మరణ వార్తతో తండ్రి ఆంజనేయ ప్రసాద్, తల్లి రేణుక గుండెలవిసేలా రోదిస్తున్నారు. శ్రీనగర్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.




“

వైసీపీ హయాంలో మా కార్యకర్తలు, ప్రజలపై తప్పుడు కేసులు పెట్టిన వారి పేర్లు రెడ్‌బుక్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో బ్రేక్ చేసిన, అందుకు ప్రేరేపించిన నేతలు, టార్చర్ చేసినవాళ్ల పేర్లు ఉంటాయి. వైసీపీ అధినేత జగన్ పేరు ఉందో లేదో త్వరలో తెలుస్తుంది. సోషల్ మీడియాలో 16ఏళ్ల లోపువారికి ఏజ్ అప్రాప్రియేట్ కంటెంటే కనిపించాలి. దీనిపై ఫ్రేమ్‌వర్క్‌కు కసరత్తు చేస్తున్నాం.

- ఏపీ మంత్రి నారా లోకేష్

హార్డ్ వేర్ రంగం లోనూ భారత్ సత్తా

- ప్రధాని మోడీ



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: గ్లోబల్ టెక్నాలజీ వాల్యూ చైన్‌లో భారత్ వేగంగా భాగం అవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ల వాణిజ్యంలో భారత్ కీలక పాత్ర పోషించబోతుందని మోదీ తెలిపారు. గుజరాత్‌లోని సానంద్‌లో ఏర్పాటు చేసిన మైక్రాన్ టెక్నాలజీ సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రధాని మోదీ, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులతో కలిసి ప్లాంట్‌ను సందర్శించారు. ఈ నేపథ్యంలో సెమీకండక్టర్ల విప్లవంలో భారత్ పాత్ర గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్లాంట్‌కు సంబంధించిన ఎంవోయూ మూడేళ్ల కిందటే జరిగింది. ఇందులో అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్‌కు చెందిన పనులు జరుగుతాయని మోదీ తెలిపారు. అమెరికాకు చెందిన మైక్రాన్ టెక్నాలజీ రూ. 22 వేల 516 కోట్ల భారీ పెట్టుబడితో ఈ కేంద్రాన్ని నెలకొల్పినట్టు వెల్లడించారు. ఈ ప్లాంట్‌లో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కావడం ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ల వాణిజ్యంలో భారత్ పాత్రను బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ తెలిపారు. గత శతాబ్దాన్ని చమురు నియంత్రిస్తే ఈ శతాబ్దాన్ని సెమికండక్టర్లు నియంత్రిస్తాయని అభిప్రాయపడ్డారు. '10, 11 ఏళ్ల క్రితం భారత్‌లో 'డేటా', 'చిప్స్' గురించిన చర్చ కేవలం కొన్ని వర్గాలకే పరిమితమైంది. టెక్నాలజీ గురించి మాట్లాడుకున్నప్పుడు మన చర్చలు ఎక్కువగా ఐటీ సేవల చుట్టూనే తిరిగేవి. కానీ ఈరోజు చూడండి, సాఫ్ట్‌వేర్ రంగానికి పేరుగాంచిన భారత్ ఇప్పుడు 'హార్డ్‌వేర్' రంగంలో కూడా తన ఉనికిని చాటుకుంటూ శక్తిమంతంగా మారుతోంది. నేడు భారత్ అత్యంత వేగంగా 'గ్లోబల్ సెమీకండక్టర్ వాల్యూ చైన్'లో అంతర్భాగమవుతోంది' అని మోదీ తెలిపారు.

విశ్వ వీక్షణం



ఖమేని బతికే ఉన్నారు

- ఇరాన్ విదేశాంగ మంత్రి కీలక ప్రకటన

ఇరాన్ మతాధికారి, శక్తివంతమైన నాయకుడైన అయతొల్లా అలీ ఖమేనీని అంతం చేయడమే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయేల్ టెహ్రాన్‌పై సైనిక దాడులకు తెగబడ్డాయి. ఇరుదేశాల క్షిపణులు ఖమేనీ నివాసం, కార్యాలయం లక్ష్యంగా దూసుకెళ్లాయి. ఈ దాడుల్లో ఖమేనీ హతమయ్యారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే.. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్‌చీ మాత్రం ఖమేనీ, అధ్యక్షుడు మృతి చెందారనే వార్తల్ని ఖండించారు. ఖమేనీ, అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రాణాలతోనే ఉన్నారని ఆయన వెల్లడించారు. టెహ్రాన్‌లో మార్పుకు నాంది పలకాలనే ఉద్దేశంతో అమెరికా, ఇజ్రాయేల్ సంయుక్తంగా దాడులకు పాల్పడుతున్నాయి. ఖమేనీ సహా అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో పాటు పలువురు కీలక నేతలను అంతమొందించాలని ట్రంప్, నెతన్యాహు దాడుల్ని ముమ్మరం చేశారు. ఖమేనీ కార్యాలయంపై జరిపిన దాడుల్లో ఆయన చనిపోయారనే వార్తలు వైరలయ్యాయి. అయితే.. విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్‌చీ అవన్నీ వదంతులే అని కొట్టిపారేశారు. 'నాకు తెలిసినంత వరకూ ఖమేనీ, మసూద్ పెజెష్కియాన్ ప్రాణాలతోనే ఉన్నారు' అని అల్ అలమ్ టీవీకి ఆయన తెలిపారు. కానీ, ఇప్పటివరకూ ఖమేనీ ఎక్కడ ఉన్నారు? అనేది మాత్రం ఇరాన్ అధికారులు వెల్లడించలేదు. టఇజ్రాయేల్, అమెరికా దాడులకు ముందే ఆయన టెహ్రాన్‌ను వీడారని, సురక్షిత ప్రాంతంలో తలదాచుకున్నారని రాయిటర్స్ మీడియా సంస్థకు ఇరాన్ ప్రభుత్వం తెలియజేసింది. నిరుడు జూలైలో ఇరాన్‌లోని అణుశక్తి కేంద్రాలే లక్ష్యంగా దాడులకు దిగిన అమెరికా.. ఈసారి మాత్రం పౌరులు, ప్రభుత్వ కార్యాలయాలు.. రాజకీయ నాయకులు ఇళ్లను టార్గెట్ చేసింది.

సింగిడి
హైదరాబాద్
ఆదివారం
01.03.2026

ప్రతిపక్షం
Prathipaksham.in



ఇంటి ఆవరణలో కొత్తిమీర

తాజా తాజాగా పెంచుకోండి ఇలా!

కొత్తిమీరను కుండలో పెంచుకోవచ్చని మీకు తెలుసా? మీ ఇంటి బాల్కనీలోనే ఇలా పెంచుకుని తాజా తాజాగా వాడుకోవచ్చు. కొత్తిమీరను పండించడం చాలా సులభం. కొత్తిమీర కలిపిన కూర తినడానికి రుచికరంగా మారుతుంది. చట్నీలో కొత్తిమీర ఉంటే ఆ మజాయే వేరు కదా! కొత్తిమీర శీతాకాలంలో సులభంగా దొరుకుతుంది. వేసవి కాలం, వర్షాకాలంలో కొత్తిమీర దొరకడం కష్టం. అటువంటి పరిస్థితిలో, మీరు మీ ఇంటి బాల్కనీలో ఒక కుండలో కొత్తిమీరను పెంచుకోవచ్చు. మార్కెట్ కొత్తిమీర కంటే ఈ కొత్తిమీర సుగంధంగా ఉంటుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసి కూరగాయలలో వేయవచ్చు లేదా చట్నీ చేసి తినవచ్చు. ఏదైనా పాత బకెట్, టబ్ లేదా వెడల్పాటి కుండలో పెంచుకోవచ్చు. కేవలం ఆరు రోజులలో పెరగడానికి సిద్ధంగా ఉంటుంది.

ఎలా పెంచాలి

కొత్తిమీర గింజలను తీసుకోవాలి. విత్తన దుకాణం నుండి వీటిని కొనుగోలు చేయవచ్చు. ముందుగా కొద్దిగా కొత్తిమీరను ఒక రోజు ఎండలో ఆరబెట్టండి. ఎండిన కొత్తిమీరను నేలపై ఉంచి, పైన కొత్తిమీర గింజలను వేసి ఒక ఇటుక లేదా కాబ్ వంటి బరువైన వస్తువుతో రుద్దండి. దానిని రెండు భాగాలుగా విభజించండి. వీటిని రాత్రంతా నీటిలో నానబెట్టండి. ఒక కుండీలో మట్టి, కొంత వర్మీ కంపోస్ట్ నింపాలి. మట్టిలో మాత్రమే కొత్తిమీరను పండించవచ్చు. కొత్తిమీర పండించే కుండలో నీరు పోవడానికి అడుగున రంధ్రాలు ఉండాలి. ఇప్పుడు నానబెట్టిన కొత్తిమీరను మట్టి పైన వేయండి. కొత్తిమీర నానబెట్టిన నీటిని చల్లి, కుండలో కూడా వేయండి. కొత్తిమీర గింజలు కుండ అంతటా బాగా విస్తరించాలని గుర్తుంచుకోండి. ఒకే చోట గుమిగూడకూడదు. ఇప్పుడు కొత్తిమీర గింజలపై పలుచని మట్టిని పోసి దానిపై నీళ్లు చల్లాలి. స్ప్రే బాటిల్ నుండి మాత్రమే నీటిని పోయాలి, తద్వారా నీరు ప్రతిచోటా ఒకే ఒత్తిడితో వెళుతుంది. ఇప్పుడు టబ్‌ను పూర్తి సూర్యకాంతిలో ఉంచండి. ఎండిపోతున్నట్లు అనిపించినప్పుడు నీటిని పిచికారీ చేయండి. కొత్తిమీర గింజలు కుళ్లిపోతాయి కాబట్టి ఎక్కువ నీరు వేయడం మానుకోండి. మంచి కొత్తిమీర 15-20 రోజులలో తయారవుతుంది. పొడిగా కనిపించినప్పుడు మాత్రమే కుండకు నీరు పెట్టండి. ఎక్కువ నీరు జోడించడం మానుకోండి.





ఈ చట్నీ మీరు తిన్నారా!!

కొత్తిమీర చట్నీ తినడంతో మీకు విసుగు కలిగితే, ఈ చట్నీని తప్పక ప్రయత్నించండి. టమోటా, వెల్లుల్లితో చేసిన ఈ చట్నీ రుచికరంగా ఉంటుంది. కొంతమందికి చట్నీ అంటే చాలా ఇష్టం, చట్నీ లేకుండా వారి ఆహారం అసంపూర్ణంగా ఉంటుంది. టొమాటో, వెల్లుల్లి చట్నీ గురించి తెలుసుకుందామా! ముందుగా టొమాటోలను కడిగి కట్ చేసుకోండి. తర్వాత ఉల్లిపాయను కట్ చేయాలి. ఇప్పుడు బాణలిపై నూనె వేడి చేసి టొమాటోలను వేయించాలి. తరిగిన ఉల్లిపాయ, ఒలిచిన వెల్లుల్లిని పాన్ మీద బాగా వేయించాలి. అవి చల్లారిన తర్వాత, టమోటా తొక్కను తీసివేసి వేరు చేయాలి. ఇప్పుడు ఉప్పు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, టమోటా, ఉల్లిపాయ, వెల్లుల్లికి జోడించండి. వీటన్నింటిని బాగా గ్రయిండ్ చేయండి. చట్నీ సర్వ్ చేయడానికి సిద్ధంగా ఉంది. మరింత స్పైసీగా కావాలనుకుంటే, మొదట్లో పచ్చిమిర్చిని వేయించి, ఆపై వాటిని అన్ని మసాలాలతో రుబ్బుకోవచ్చు. ఈ చట్నీ రుచి పిల్లల నుండి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. ఈ చట్నీ చేయడానికి, మీకు ఎక్కువ పదార్థాలు అవసరం లేదు లేదా ఎక్కువ సమయం పట్టదు. ఈ చట్నీని తిన్న తర్వాత, ఇష్టమైన వంటకాల జాబితాలో మీరు ఈ రెసిపీని చేర్చుకుంటారు.



కూనో నేషనల్ పార్కుకు మరో 9 చీతాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: మధ్యప్రదేశ్‌లోని కూనో నేషనల్ పార్క్‌కు మరో 9 చీతాలు చేరుకున్నాయి. దక్షిణాఫ్రికాలోని బోట్స్‌వానా నుంచి ఈ తొమ్మిది చీతాల్ని అధికారులు ఇండియాకు తీసుకొచ్చారు. వీటిని త్వరలోనే ప్రత్యేక నివాస స్థలాల్లోకి వదలనున్నారు. దాదాపు నాలుగేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం 'ప్రాజెక్ట్ చీతా' కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా 2023 వరకు మొత్తం 20 చీతాల్ని విదేశాల నుంచి తీసుకొచ్చారు. మొదట సెప్టెంబర్ 2022లో ఎనిమిది చీతాల్ని నమీబియా నుంచి తీసుకొచ్చారు. అలాగే రెండో దశలో ఫిబ్రవరి 2023లో దక్షిణాఫ్రికా నుంచి 12 చీతాల్ని తీసుకొచ్చారు. ఇప్పుడు మూడో దశలో బోట్స్‌వానా నుంచి 9 చీతాల్ని తీసుకొచ్చారు. వీటిలో మూడు మగ చీతాలు, ఆరు ఆడ చీతాలున్నాయి. బోట్స్‌వానా నుంచి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ప్రత్యేక విమానంలో మధ్య ప్రదేశ్‌లోని గ్వాలియర్ పట్టణానికి తీసుకొచ్చారు. వీటిని కూనో నేషనల్ పార్క్ పరిధిలో చీతాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్లలోకి వదిలిపెడతారు. కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ వీటిని విడుదల చేయనున్నారు. అక్కడ వీటిని అధికారులు, నిపుణులు పర్యవేక్షిస్తుంటారు. ఈ చీతాల రాకతో దేశంలో వీటి సంఖ్య 48కి చేరింది. దేశంలో చీతాల సంఖ్య పెంచాలని కేంద్రం భావిస్తోంది. అందువల్లే మన దేశంలో అంతరించిపోయే దశలో ఉన్న వీటిని రక్షించేందుకు చర్యలు చేపట్టింది.



యుద్ధం నేపథ్యంలో... విమాన సర్వీసులపై కేంద్రం అలర్ట్

- మంత్రి రామ్మోహన్ నాయుడు సమీక్ష

ప్రతిపక్షం నేషనల్ బ్యూర్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకున్న వేళ, అంతర్జాతీయ విమాన సర్వీసులపై పడే ప్రభావంపై కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. డీజీసీఏ, ఇతర భాగస్వామ్య పక్షాలతో కలిసి ప్రయాణికుల భద్రత, విమాన కార్యకలాపాల కొనసాగింపుపై కీలక ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమాసియాలో గగనతల ఆంక్షలు, నోటమ్స్ (NOTAMs) జారీ అయిన నేపథ్యంలో, ప్రయాణికులకు భద్రత కల్పించేందుకు, రియల్‌టైమ్ సమన్వయం చేసుకునేందుకు ఈ సమీక్ష సమావేశం నిర్వహించినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ (ఎంఓసీఏ) తెలిపింది. కాగా, అంతర్జాతీయ సర్వీసులు నడుపుతున్న భారతీయ విమానయాన సంస్థలు ఆయా దేశాల గగనతల అడ్వైజరీలను, రూట్ ఆంక్షలను నిరంతరం పర్యవేక్షించాలని రామ్మోహన్ నాయుడు సూచించారు. అంతేకాదు ముందస్తు ప్రణాళికలు, ఇంటర్నేషనల్ సెక్యూరిటీ ప్రోటోకాల్స్ ప్రకారం విమానాలను దారి మళ్లించడం లేదా రీరూటింగ్ చేయడం లాంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం దేశంలోని ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాలను ఆపరేషనల్ అలర్ట్‌లో ఉంచారు. విమానాల మళ్లింపు, అన్‌షెడ్యూల్డ్ ల్యాండింగ్‌లు సహా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవడానికి సర్వసన్నద్ధంగా ఉండాలని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), ప్రైవేట్ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లకు సూచించారు. గ్రౌండ్ హ్యాండ్లింగ్, పార్కింగ్ బేస్, ఇమ్మిగ్రేషన్ సపోర్ట్, క్రూ లాజిస్టిక్స్ విషయంలో విమానయాన సంస్థలతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.



చరిత్ర సృష్టించిన జమ్మూకశ్మీర్..

- తొలిసారి రంజీ ట్రోఫీ కైవసం

జమ్మూకశ్మీర్‌క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. రంజీ ట్రోఫీని మొట్ట మొదటి సారి గెలుచుకున్నది. కర్నాటకతో హుబ్లీలో జరిగిన ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని సాధించిన జమ్మూకశ్మీర్ జట్టుకు రంజీ ట్రోఫీ దక్కింది. ఇవాళ అయిదో రోజు జమ్మూకశ్మీర్ బ్యాటర్లు కర్నాటక బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నారు. జేకే బ్యాటర్లు కమ్రాన్ ఇక్బాల్, సాహిల్ లోత్రాలు.. కర్నాటక బౌలర్లను ఆటాడుకున్నారు. ఆ ఇద్దరూ అయిదో వికెట్ అజేయంగా 197 రన్స్ జోడించారు. కమ్రాన్ ఇక్బాల్ 160 , సాహిల్ లోత్రా 101 రన్స్ చేసి క్రీజ్‌లో ఉన్నారు. రెండో ఇన్సింగ్‌లో ఇవాళ జమ్మూకశ్మీర్ జట్టు 4 వికెట్లు కోల్పోయి 342 రన్స్ చేసిన సమయంలో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. జేకే జట్టు మొత్తం 633 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. అయితే కర్నాటక, జమ్మూకశ్మీర్ కెప్టెన్లు డ్రాకు అంగీకరించడంతో.. రంజీ ట్రోఫీ జేకే జట్టును వరించింది.





ప్రపంచకప్ నుంచి పాకిస్థాన్ ఔట్..

- సెమీస్‌కు దూసుకెళ్లిన న్యూజిలాండ్

పొట్టి ప్రపంచకప్ నుంచి పాకిస్థాన్ నిష్క్రమించింది. సెమీఫైనల్ బెర్తుపై కన్నేసిన పాక్ భారీ తేడాతో శ్రీలంకను ఓడించలేకపోయింది. ఓపెనర్ ఫర్హాన్(100) సెంచరీతో పల్లెకెలె స్టేడియంలోభారీ స్కోర్ చేసినా.. బౌలర్లు శ్రీలంకను 147లోపు కట్టడి చేయలేకపోయారు. స్పిన్నర్లు చెలరేగినా.. పవన్ రత్ననాయకే(58) అర్ధశతకంతో విరుచుకుపడి పాక్ ఆశలపై నీళ్లు చల్లాడు. నాకౌట్ తొలి మ్యాచ్ వర్షార్పణం కావడం.. ఆపై ఇంగ్లండ్ చేతిలో ఓటమి.. పాకిస్థాన్ జట్టు సెమీస్ అవకాశాల్ని సంక్లిష్టం చేశాయి. ఇక ఇంటిదారి పట్టడం పక్కా అనుకున్న వేళ.. న్యూజిలాండ్ అనూహ్యంగా పరాజయం పాలవ్వడం పాక్‌కు కలిసొచ్చింది. శ్రీలంకపై భారీ తేడాతో గెలిస్తే సెమీస్ చేరడం ఖాయమనిపించింది. కానీ, 212 రన్స్ కొట్టినా పాకిస్థాన్ బంతితో మాత్రం శ్రీలంకను పడగొట్టలేకపోయింది. మైనస్ రన్ రేటులో ఉండడంతో లంకను 147లోపే కట్టడి చేస్తేనే పాక్ సెమీస్ దూసుకెళ్లే పరిస్థితి. ఆరంభంలోనే నసీం షా డేంజరస్ పథుమ్ నిశాంక వికెట్ తీసి బ్రేకిచ్చాడు. ఆ తర్వాత అబ్రార్ అహ్మద్ మూడు వికెట్లతో చెలరేగాడు. అంతే.. పాక్ ఆటగాళ్ల ముఖాల్లో ఆనందం విరిసింది. కానీ, పవన్ రత్ననాయకే(58), కెప్టెన్ దసున్ శనకతో కీలక భాగస్వామ్యం నెలకొల్పి.. పాక్ ఆశలను గల్లంతు చేశాడు. లంక స్కోర్ 148 దాటడమే ఆలస్యం.. పాక్ ఇంటిదారి పట్టింది.



టీమిండియాలోకి జమ్మూ కశ్మీర్ ఫాస్ట్ బౌలర్!

జమ్మూ కశ్మీర్ భారత క్రికెట్‌లో సంచలనం సృష్టించింది. ఊహకందని విధంగా పెద్ద జట్లకు షాకిస్తూ ఫైనల్ చేరిన జేకే టీమ్.. కర్నాటకను నిలువరించి తొలిసారి రంజీ విజేతగా అవతరించింది. జమ్మూకశ్మీర్ జట్టు విజయంలో కీలకమైన ఒకేఒక్కడు.. అకీబ్ నబీ. టోర్నీ ఆసాంతం నిలకడగా రాణించి 67 ఏళ్ల కలను సాకారం చేసిన ఈ బారాముల్లా ఎక్స్‌ప్రెస్‌గా.. బంతికంటే వేగంగా భారత జట్టు వైపు దూసుకొస్తున్నాడు. తన అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో ఇప్పటికే సెలెక్టర్ల దృష్టిలో పడిన పేస్ గన్ టీమిండియా అరంగేట్రానికి సిద్ధంగా ఉన్నాడు. క్రికెట్‌లో రాణించాలంటే మెరుగైన వసతులు ఉండాలి. కానీ, అరకొర వసతుల నడుమ ఆత్మవిశ్వాసమే ఆలంబనగా దేశవాళీలో సంచలనంగా మారాడు ఆకిబ్ నబీ. ఉగ్రదాడులు.. తుపాకుల గర్జనతో కల్లోలిత ప్రాంతంగా పేరొందిన జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా నుంచి దూసుకొచ్చాడీ పేసర్. సీజన్ సీజన్‌కు మరింత రాటుదేలిన అతడు.. రంజీ ట్రోఫీకి ముందే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 15 వికెట్లతో వార్తల్లో నిలిచాడు. ఈసారి రంజీ ట్రోఫీతో జమ్మూకశ్మీర్ తురుపుముక్కగా అవతరించిన అకీబ్.. జమ్మూ కశ్మీర్ చిరకాల స్వప్నం సాకారమవ్వడంలో కీలకమయ్యాడు. బంతిని రెండువైపులా స్వింగ్ చేయగల నేర్పు, కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బ్యాటర్లను బోల్తా కొట్టించగల సమర్థుడైన అకీబ్ రంజీ ట్రోఫీలో వికెట్ల పండుగ చేసుకున్నాడు. ఆరంభంలోనే కాకుండా కీలకమైన క్వార్టర్, సెమీస్, ఫైనల్లోనూ నిప్పులు చెరిగి ఐదేసీ వికెట్లతో జట్టు విజయాల్లో భాగమయ్యాడు. టైటిల్ పోరులో కర్నాటక జట్టుకు షాకిస్తూ డేంజరస్ కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్, స్మరన్ రవిచంద్రన్‌ల వికెట్ తీసి జమ్మూకశ్మీర్ విజయానికి దారులు వేశాడు. ఏకంగా ఏడుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేయడ మామూలు విషయం కాదు. మొత్తంగా 60 వికెట్లతో ఔరా అనిపించి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును ఎగరేసుకుపోయాడీ స్పీడ్‌స్టర్.



20 కోట్ల బడ్జెట్.. 35 రోజులు

సంబరాల ఏటిగట్టు భారీ క్లైమాక్స్ షూటింగ్

మెగా సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ పాన్‌ఇండియా స్పెక్టెకల్ సంబరాల ఏటిగట్టుతో ఇంతకు ముందెన్నడూ చూడని ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధమవుతున్నాడు. రోహిత్ కెపి దర్శకత్వంలో పాన్‌ఇండియా బ్లాక్‌బస్టర్ హనుమాన్ అందించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నెక్స్ట్ లెవల్ లో రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన అసుర ఆగమన గ్లింప్స్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. టీం ప్రస్తుతం భారీ, హైఆక్టేన్ క్లైమాక్స్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తోంది. మేకర్స్ క్లైమాక్స్ కోసం ప్రత్యేకంగా 20 కోట్లకు పైగా కేటాయించారు. 35 రోజుల షెడ్యూల్ జరుగుతోంది, ఇందులో 18 భారీ యాక్షన్ బ్లాక్‌లు ఉన్నాయి, ప్రముఖ స్టంట్ డైరెక్టర్ కెవిన్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. యుద్ధభూమిని తలపించేలా రూపొందించిన క్లైమాక్స్ మహాభారతంలోని కురుక్షేత్ర యుద్ధం గుర్తు చేసేలా ఉండబోతుంది. ప్రేక్షకులకు రా, ఇమర్సివ్, విజువల్‌గా గ్రాండియర్ అనుభూతిని అందించేలా ఈ క్లైమాక్స్‌ను మలిచారు. సాయి దుర్గా తేజ్ ఈ చిత్రానికి పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఇంటెన్స్, ఫియర్స్ మేకోవర్‌తో పాటు ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాల కోసం హైరిస్క్ స్టంట్స్‌ను స్వయంగా చేస్తూ, తన కెరీర్‌లో ఇప్పటివరకు మోస్ట్ ఛాలెంజింగ్ గా నిలిచిన పాత్రలో కనిపించబోతున్నారు. టాప్ టెక్నికల్ టీమ్ ఈ చిత్రానికి పని చేస్తోంది. సినిమాటోగ్రఫీని వెట్రివేల్ పళనిసామి అందిస్తుండగా, సంగీతాన్ని బి. అజనీష్ లోకనాథ్ సమకూరుస్తున్నారు. ఎడిటింగ్‌ను నవీన్ విజయకృష్ణ నిర్వహిస్తుండగా, ప్రొడక్షన్ డిజైన్‌ను గాంధీ నడికుడికర్ రూపొందిస్తున్నారు. ప్రతి విభాగంలోనూ అత్యుత్తమ నైపుణ్యంతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది.



జీ 5లో 'గాంధీ టాక్సీ'

థియేటర్లలో అద్భుతమైన స్పందన వచ్చిన తర్వాత 'గాంధీ టాక్స్' ఇప్పుడు మార్చి 6 నుండి ZEE 5లో ప్రపంచ డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధంగా ఉంది. ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళంలో అందుబాటులోకి రానుంది. మూవీమిల్, క్యోరియస్‌తో కలిసి జీ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం థియేటర్లలో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. కిషోర్ పాండురంగ్ బెలేకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'గాంధీ టాక్స్'లో విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి, అదితి రావు హైదరి, సిద్ధార్థ్ జాదవ్ వంటి అద్భుతమైన తారాగణం నటించింది. ఏఆర్ రెహమాన్ అందించిన మ్యూజిక్ ఈ చిత్రానికి మరింత ఆకర్షణగా నిలిచిన సంగతి తెలిసిందే. 'గాంధీ టాక్స్' అనేది వ్యక్తిగత నష్టం, ఆర్థిక ఒడిదుడుకులు, నైతిక సందిగ్ధతలను ఎదుర్కొన్న కొందరి వ్యక్తుల ప్రయాణం. వారి మార్గాలు, ప్రయాణాలు ఎలా కలిశాయి.. ఆ తరువాత కలిగిన పర్యవసానాలు ఏంటి? అనే ఆసక్తికరమైన అంశాలతో కథ సాగుతుంది. ఎలాంటి డైలాగ్స్ లేకపోయినా నటీనటుల పర్ఫామెన్స్, విజువల్స్, మ్యూజిక్‌తోనే కథను నడిపించిన తీరు అద్భుతంగా ఉంటుంది. ప్రేక్షకులకు లోతుగా లీనమయ్యే, కనెక్ట్ చేసేలా ఓ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను 'గాంధీ టాక్స్' ఇస్తుంది. డిజిటల్ స్ట్రీమింగ్ సందర్భంగా విజయ్ సేతుపతి మాట్లాడుతూ .. ''గాంధీ టాక్స్' నాకు చాలా ప్రత్యేకమైన చిత్రం. ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఎన్నో విషయాల్ని ఈ మూవీ కమ్యూనికేట్ చేస్తుంది. మన పర్ఫామెన్స్, ప్రజెన్స్‌తో పూర్తిగా భావోద్వేగాలను వ్యక్తపరచడం ఒక ప్రత్యేకమైన అనుభవం. థియేటర్‌లో మాకు అద్భుతమైన స్పందన రావడం ఆనందంగా ఉంది. ఇక ఇప్పుడు ఈ చిత్రం ఇప్పుడు ZEE 5 ద్వారా అందరి ఇళ్లలోకి రాబోతోంది. ప్రేక్షకులు మా 'గాంధీ టాక్స్'తో, అందులోని సందేశంతో కనెక్ట్ అవుతారని, ఓ మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను పొందుతారని ఆశిస్తున్నాను' అని అన్నారు.


వెంకటప్పయ్య నాయుడు

హార్డ్ హిట్టింగ్ సినిమాలు అందించడంలో పాపులరైన దర్శకుడు అజయ్ భూపతి ప్రస్తుతం' శ్రీనివాస మంగాపురం'చేస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్‌బాబు సోదరుడి కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. వైరల్ అయిన ఉయ్ అమ్మ ట్రాక్‌తో దేశవ్యాప్తంగా అలరించిన తర్వాత రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తున్నారు. అగ్ర నిర్మాత అశ్విని దత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. నిర్మాత పి కిరణ్ నిర్మిస్తున్న శ్రీనివాస మంగాపురం ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్‌లతో స్ట్రాంగ్ బజ్‌ను సృష్టించింది. ఈరోజు, మేకర్స్ ఈ చిత్రంలో మరో ప్రముఖ పాత్రను పరిచయం చేశారు. వెంకటప్పయ్య నాయుడుగా మోహన్ బాబు ఫెరోషస్ ఫస్ట్ లుక్ అదిరిపోయింది. పోస్టర్‌లో ఆయన ఇంటెన్స్ గా నడుస్తూ, రా అథారిటీని ప్రజెంట్ చేశారు. సాల్ట్ అండ్ పెప్పర్ జుట్టు, మీసం ఆయన ఫియర్స్ వ్యక్తిత్వాన్ని మరింత హైలైట్ చేస్తుంటే, తెల్లటి కుర్తా-ధోతి ఆయనను శక్తివంతమైన గ్రామ పెద్దగా చూపిస్తోంది. మెడలో బంగారు గొలుసులు, చేతికి వాచ్, బ్రేస్లెట్ వింటేజ్ మాస్ టచ్‌ను అందిస్తున్నాయి. ఆయన వెనుక తుపాకులతో నిలిచిన మనుషుల సమూహం చూస్తుంటే గౌరవంతో పాటు భయాన్ని కూడా కలిగించే వ్యక్తి అర్థమౌతుంది. మొత్తంగా ఈ పోస్టర్ తన నేలను గొప్ప సంకల్పంతో పాలించే వ్యక్తి స్వభావాన్ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. మోహన్ బాబు ఇప్పటికే టీమ్‌లో చేరగా, సినిమా షూటింగ్ ప్రస్తుతం కొనసాగుతోంది.



కొత్త జంట.. రణబాలి లుక్ రిలీజ్

స్టార్ హీరో హీరోయిన్లు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఇంకా పెళ్లి హడావుడిలోనే ఉండగా.. వారిద్దరికి సంబంధించిన మ్యారేజ్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది! విజయ్ రష్మిక జంటగా మరోసారి నటిస్తున్న రణబాలి మూవీ టీమ్ ఆ వీడియో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఆ గ్లింప్స్.. అందరినీ ఆకట్టుకుని ఓ రేంజ్ లో సందడి చేస్తోంది. అయితే రణబాలి మూవీ టీమ్ విజయ్ రష్మిక రియల్ మ్యారేజ్ వీడియో పోస్ట్ చేసిందనుకుంటే పొరపాటే! తమ సినిమాలోని పెళ్లి పాటకు సంబంధించిన గ్లింప్స్ ను శనివారం ఉదయం రిలీజ్ చేసింది. అంతే కాదు.. కొత్త జంటకు బెస్ట్ విషెస్ కూడా తెలిపింది. సినిమాలో రణబాలి, జయమ్మగా విజయ్ దేవరకొండ, రష్మిక కనిపించనుండగా.. వాళ్ల లవ్ ను స్పెషల్ సర్ప్రైజ్ తో సెలబ్రేట్ చేస్తున్నామని రాసుకొచ్చింది. ఏందయ్యా సామి.. అంటూ సాగే పాటలో మేకర్స్ సినిమాలో విరోష్ వెడ్డింగ్ కు సంబంధించిన విజువల్స్ ను చూపించారు. పసుపు దంచడం, పెళ్లి, అత్తవారింట్లో జయమ్మ అడుగుపెట్టడం వంటి మూమెంట్స్ ను చూపించి మెప్పించారు. ఆ తర్వాత మ్యారేజ్ లైఫ్ లో కొన్ని సీన్స్ ను యాడ్ చేశారు. అయితే విజయ్, రష్మిక కెమిస్ట్రీకి ఎవరూ ఫిదా అవ్వకుండా ఉండరేమో!





'పల్లెలోని సందల్లన్ని మీవే'

'కోర్ట్' చిత్రంలో హర్ష్ రోషన్, శ్రీదేవీ తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. మళ్లీ ఇప్పుడు వీరిద్దరూ కలిసి 'బ్యాండ్ మేళం' అంటూ ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. బ్లాక్ బస్టర్ రచయిత కోన వెంకట్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపు దిద్దుకుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కావ్య, శ్రావ్య ఈ మూవీని నిర్మించారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని మార్చి 13న రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు వదిలిన కంటెంట్ ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. 'బ్యాండ్ మేళం' టీజర్, 'తిప్పు కుంటానవ్' అనే పాట ఎంతగా వైరల్ అయ్యాయో అందరికీ తెలిసిందే. ఇక ఇప్పుడు ఈ మూవీ నుంచి రెండో పాటను విడుదల చేశారు. 'పల్లెలోని సందల్లన్ని మీవే' అంటూ సాగే మెలోడీ పాటను మాస్ మహారాజా రవితేజ సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. పాటను రిలీజ్ చేసిన అనంతరం రవితేజ 'బ్యాండ్ మేళం' టీంకి బెస్ట్ విషెస్‌ను తెలియజేశారు. 'పల్లెలోని సందల్లన్ని మీవే' అంటూ సాగే ఈ బ్యూటీఫుల్ మెలోడీ పాటకు విజయ్ బుల్గానిన్ ఎంతో క్యాచీ ట్యూన్‌ను అందించారు. ఆస్కార్ అవార్డు గెలుచుకున్న గీత రచయిత చంద్రబోస్ సాహిత్యం ఎంతో అర్థవంతంగా ఉంది. ఈ పాటను శ్వేతా మోహన్ ఆలపించారు. లిరికల్ వీడియోని చూస్తుంటే.. గిరి, రాజిల స్కూల్, చైల్డ్ మెమరీస్‌కు సంబంధించినట్టుగా కనిపిస్తోంది. హర్ష్ రోషన్, శ్రీదేవి స్కూల్ యూనిఫాంలో కనిపించడం, స్కూల్లో చేసిన అల్లరి పనులు, కంపోజ్ చేసిన స్టెప్పులు, పాటను చిత్రీకరించిన తీరు అందరినీ మంత్రముగ్ధులను చేసేలా ఉంది. సునీల్ సున్నాపు, ఫాల్గుణి బంగేరా కంపోజ్ చేసిన హుక్ స్టెప్పులు నెట్టింట్లో వైరల్ అయ్యేలా కనిపిస్తున్నాయి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200